తీన్మార్
తెలుగు దినపత్రిక

## మరింత ఉధృతంగా కార్మిక కర్షక పోరాటాలు

ఎట్టుబడిదారీ వ్యవస్థలో రోజురోజుకు తీవ్రమౌతున్న సంక్షోభాలు, గతంలో ఎన్నడూ లేని విధంగా కరోనా మహమ్మారి విస్తరణ, ప్రపంచం గత ఎనిమిది దశాబ్దాలలో ఎరుగని వరుస రెండవ మాంద్యం...వంటి అంశాలు నయా ఉదారవాద నమూనా యొక్క డొల్లతనాన్ని, అనాగరికతను బహిర్గతం చేశాయి. పెరుగుతున్న అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, మెజారిటీ ప్రజలు ఎదుర్కొంటున్న వ్యాధుల పట్ల పాలక పక్షాలు తీవ్రమైన ఉదాసీనతతో కూడిన వైఖరిని అవలంభించాయి. ఇదే సమయంలో, మహమ్మారి వలన ఏర్పడిన అత్యంత వినాశకర పరిస్థితిలో కూడా అతి కొద్దిమందిగా ఉన్న కార్పొరేట్ కుబేరులకు గరిష్టంగా లాభాలు సమకూర్చే పనిలో నిమగ్నమైంది. మహమ్మారి వ్యాపించిన గత రెండు సంవత్సరాల కాలంలో ప్రపంచ జనాభాలో 99 శాతం ప్రజలందరి రెండు రెట్ల సంపదను ప్రపంచంలోని 1 శాతం ధనవంతులు పోగు చేసుకున్నారు. భారత దేశంలోని ప్రజలు అప్పులతో, పేదరికం, నిరుద్యోగం, ఆకలితో కొట్టుమిట్టాడుతున్న సమయంలో, బిజెపి ప్రభుత్వానికి అనుకూలమైన ఆప్తమిత్రులు సంపదను కూడబెట్టుకోవడాన్ని చూస్తున్నాం. భారత దేశంలోని 40 శాతానికి పైగా సంపద జనాభాలో 1 శాతం వద్ద ఉన్నది. భారత దేశంలోని బిలియనీర్ల సంఖ్య 2021లో 102 నుండి 166కు పెరిగింది. దీనికి భిన్నంగా, ప్రపంచంలోనే అత్యధికంగా, 23 కోట్ల మంది భారత ప్రజలు పేదరికంలో నివసిస్తున్నారు. అత్యంత దారుణమైన తిరోగమనంతో కూడిన అనాగరిక చర్య ఏమంటే లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులు తాము వున్న ప్రదేశం నుండి ఒకేసారి సామూహిక వలసలు చేపట్టవలసిరావడం, ఆక్సిజన్‌తో పాటు, కనీస ఆరోగ్య వసతుల కొరత వల్ల గంగానదిలో శవాలు తేలడం. అదే సమయంలో కార్పొరేట్, మతతత్వ పాలకులు 'పి.ఎం కేర్స్' పేరుతో కోట్ల రూపాయలను పోగు చేసుకున్నారు. ఇదే సందర్భంలో వారి ఆశ్రితులు సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను ఇతర వనరులను స్వాధీనం చేసుకొని, సంపదలను కూడబెట్టుకున్నారు. గత ఎనిమిదేళ్ల మోడీ బిజెపి పాలనను గమనించినట్లయితే, గతంలో ఎన్నడూ ఎరుగని విధంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, నిరుద్యోగ యువతతో పాటు భారీ సంఖ్యలో నాలుగు లక్షల పైగా ప్రజలు నిస్పృహతో ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రమై ప్రజలు, రైతాంగం పేదరికంలోకి నెట్టివేయబడటమే కాక, తమ ఉపాధికి అవసరమైన కనీస వనరులను కోల్పోయారు. ఈ దుర్భర పరిస్థితి నుండి దృష్టి మళ్లించేందుకు మతపరమైన విభజనలను సృష్టిస్తున్నారు. అల్ప సంఖ్యాక వర్గాలపై, బలహీన వర్గాలపై దాడులు చేస్తున్నారు. నయా ఉదారవాద విధానాలను నిరోధించేందుకు ప్రపం చవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించాయి. భారతదేశంలో కూడా సామూహిక ప్రజా పోరాటాలను నిర్వహించి చారిత్రికమైన విజయాలను సాధించాయి. తద్వారా నిరంకుశ ప్రభుత్వం తన విధానాలను, అనివార్యంగా వెనక్కి తీసుకునేట్లు చేయగలిగాయి. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) స్వతంత్రంగా పోరా టాలు నిర్వహించి, నూతన ప్రాంతాలకు విస్తరించింది. ఎఐకె ఎస్ నవంబర్ 2016లో స్వతంత్రంగా నిర్వహించిన కిసాన్ సంఘర్ష్ జాతా, కిసాన్ సంఘర్ష్ ర్యాలీ, నరేంద్ర మోడీ వినాశకర నోట్ల రద్దుకు వ్యతిరేకంగా నిర్వహించబడిన మొట్టమొదటి అఖిల భారత నిరసన కార్యక్రమం. రాజస్థాన్ రైతాంగం నిర్వహించిన పోరాటాలు, నాసిక్ నుండి ముంబాయి వరకు రైతులు నిర్వహించిన కిసాన్ లాంగ్ మార్చ్ బిజెపి ప్రభుత్వాలను ఓడించి, అనివార్యంగా డిమాండ్లను అంగీకరించేట్లు చేసింది. ఆవిధంగా బిజెపి ప్రభుత్వ మెడ వంచవచ్చున్న స్పష్టమైన సందేశాన్నిచ్చింది. ఈ పోరాటాలు ప్రజల అవగాహనా శక్తిని పెంచడమే కాక, వారిలో విశ్వాసాన్ని పెంపొందించాయి. ఆల్‌ఇండియా కిసాన్ సభ, సమస్యల ప్రాతిపదికన ఐక్యతను, ఐక్య పోరాటాలను నిర్మించడంలో చొరవ చూపింది. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వ అనాగరిక భూమి సేకరణ ఆర్డినెన్సును వెనక్కు తీసుకోవడంలో భూమి అధికార్ ఆందోళన్ అవిశ్రాంత పోరాటాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఐక్య పోరాటం ద్వారా నిరంకుశ, కార్పొరేట్, మతతత్వ ప్రభుత్వానికి మొట్టమొదటి అపజయాన్ని అందించాయి. ఆల్ ఇండియా కిసాన్ కోఆర్డినేషన్ సంఘర్ష్ సమితి, సమస్యల ప్రాతిపదికన ఆల్ ఇండియా కిసాన్ సభతో పాటు, 250 రైతు సంస్థలు... గిట్టుబాటు ధరల కోసం, అప్పుల బారి నుండి విముక్తి కోసం, భారీ ఎత్తున సమీకరణలు నిర్మించడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. కేంద్ర కార్మిక సంఘాలు సైతం ఐక్య పోరాటాలను నిర్వహించడం ఈ విషయంలో చెప్పుకోదగిన అంశం. ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు నిర్వహించాయి. కార్పొరేట్ అనుకూల, మతతత్వ, నయా ఉదారవాద విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాన్ని పోరాటాలతో కట్టడి చేయడానికి కార్మిక వర్గం, రైతాంగం చైతన్యవంతమైన ఐక్య ఉద్యమాలను నిర్మించాయి. ఆల్ ఇండియా కిసాన్ సభ, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘాల ఒక దశాబ్ద కాలపు నిరంతర కృషి, ఐక్యత ద్వారా ఇది సాధ్యమైంది. 2018లో కార్పొరేట్ మీడియా ఎర్రజెండా మీద కారు కూతలు కూస్తున్న, రాస్తున్న సమయంలో ఎఐకెఎస్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో అత్యంత సమరశీల పోరాటాలు జరిగాయి. ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా ఉధృత ప్రచారంతో పాటు స్వచ్ఛందంగా కోర్టు అరెస్టులకు సిద్ధపడటం, జైల్ భరో కార్యక్రమాలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా ఐదు లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. సెప్టెంబర్ 5న, కార్మిక, కర్షక ఐక్యతను బలపరుస్తూ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ప్రదర్శన జరిగింది. ఈనిరంతర పోరాటాలు మోడీ నాయకత్వంలోని నిరంకుశ, కార్పొరేట్, మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టించాయి. కరోనా మహమ్మారి వ్యాపించి ప్రపంచమంతా వ్యాధితో పోరాడుతున్న లాక్‌డౌన్ కాలంలో అన్నిచోట్ల భయంతో కూడిన వాతావరణం నెలకొంది. లాక్‌డౌన్ విధించిన నెల రోజుల లోపే ఈ మూడు సంఘాల చొరవతో ఆర్థిక సహకారం కోసం, ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి చట్టం ప్రకారం ఉపాధి, నిరుద్యోగ వేతనాలు, సార్వత్రిక వైద్య, ఆరోగ్య సౌకర్యాలు, సామాజిక భద్రతల కోసం డిమాండ్ చేస్తూ కార్మిక వర్గం ముందుకు వచ్చింది.

# రామన్నపేట మండలంలో పొంగులేటి సుడిగాలి పర్యటన

**– ఎల్లంకి, సిరిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం**
**– వేముల వీరేశం ను భారీ మెజార్టీతో గెలిపించాలి**
**– నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాదే : పొంగులేటి వాక్య**
**– ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువలు కమిషన్ల కోసమే కాంట్రాక్టు రద్దు చేయలేదు**






నకిరేకల్ ప్రతినిధి, నవంబర్ 27(తీన్మార్ న్యూస్): నియోజకవర్గంలోని పలు మండలాలలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించారు. రామన్నపేట మండల పరిధిలో సిరిపురం, వెల్లంకి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశమును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. స్థానికంగా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై అవగాహన కలిగినటువంటి వ్యక్తి వేముల వీరేశం అని కొనియాడారు. ఇక్కడ స్థానిక నాయకులు ప్రచారంలో పలు గ్రామాలలో నాపై అవాక్కులు, చవాకులు పేల్చడం సరికాదని హెచ్చరించారు. మండలంలోని పలు అభివృద్ధి పనులు ఆటంకం కలగడానికి ప్రభుత్వంలో ఉన్నటువంటి పెద్ద స్థాయి ప్రజాప్రతినిధులే కారణమని మండిపడ్డారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాలువలు సంబంధించి మెయిన్ కాంట్రాక్టు తమ పేరిట ఉన్న మాట వాస్తవమే కాని స్థానిక మంత్రి జగదీశ్వర్ రెడ్డి బినామీలు అనుచర వర్గం సబ్ కాంట్రాక్టర్ లు పనులు జరగకుండా కమిషన్ల కక్కుర్తి పడి అట్టి పనులు జరగకుండా అడ్డుపడుతున్నారని ఒకవేళ పనులు చేయకుండా జాప్యం చేసి ఉంటే నా సంస్థ పేరు మీద ఉన్న కాంట్రాక్టు రద్దుచేసి ఉండవచ్చు కదా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను నెరవేర్చే బాధ్యత నియోజకవర్గంలో వేముల వీరేశం ది తన వెనుకాల కోమటిరెడ్డి బ్రదర్స్ నేను ముందుండి నియోజకవర్గం అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ రాజ్యం వస్తే ప్రజల సుఖసంతోషాలతో ఉంటారని, అభివృద్ధి పథంగా అన్ని కులమతాలకు సమన్యాయపాలన జరుగుతుందని అన్నారు. అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే మా సంస్థ పేరు మీద ఉన్న కాంట్రాక్టుని రద్దుచేసి త్వరగా పనులు జరిగేటటువంటి సంస్థలకు ఇచ్చి ఎందుకు పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువలకు భూసేకరణ కూడా సరిగ్గా చేయ చేతకాని ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అని మండిపడ్డారు. ఆరు నెలల్లో ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువలను పూర్తిచేసే బాధ్యత మాదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ దైద రవీందర్, మండల అధ్యక్షులు సిరిగీ రెడ్డి మల్లారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాపోలు నరసింహ, జెడ్పిటిసి పున్న లక్ష్మి జగన్మోహన్, ఎంపిటిసి తిమ్మాపురం మహేందర్ రెడ్డి, అప్పం రామేశ్వరం, ఎడ్ల సురేందర్ రెడ్డి, పున్న నరసింహ, మహిపాల్ రెడ్డి, సిరిగి నర్సిరెడ్డి, పూస బాలకృష్ణ, గంగుల రాజిరెడ్డి, అక్రమ్, శంబాల వెంకటేశం, రామన్నపేట ఎంపీటీసీ రేహాన్, వనం చంద్రశేఖర్, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




# ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

**– భక్తులతో ఆలయాలు కిటకిట.**



నేరేడుచర్ల, అక్టోబర్ 27(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల, గరిడేపల్లి మండల పరిధిలోని సోమవారం సోమేశ్వరాలయం మరియు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర, దిర్శించర్ల, పొనుగోడు, గరిడేపల్లి, కీతవారిగూడెం శివాలయంలో ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. కార్తీక పౌర్ణమి అందులోనూ సోమవారం కావడంతో మహిళలు ఉదయం నాలుగు గంటల నుండి ఇంటి ముందు తులసి గద్దెల వద్ద దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని ఆలయాలలో దీపాలు వెలిగించి ఆలయంలో హారతులు అర్పించారు. పురోహితులకు ఉసిరి దీపాలను బియ్యాన్ని కానుకగా మహిళలు ఇచ్చారు. తమకు ఇష్టమైన కార్తీక పౌర్ణమి రోజున మహిళలు ఎంతో ఇష్టంగా తమకిష్టమైన దేవుళ్లను భక్తిశ్రద్ధలతో




పూజించారు. శివన్నామస్మరణతో స్థానిక దేవాలయాలు మార్మోగాయి. శివాలయాలన్నీ కాకతీయ కాలంలో నిర్మించిన పురాతన ఆలయాలు కావున భక్తులతో కిక్కిరిసిపోయి శివనామస్మరణతో మార్మోగాయి. పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకున్న భక్తులు ధ్వజస్తంభాలు, ఉసిరిచెట్ల వద్ద దీపారాధనలు చేసి తరించారు. సంవత్సరం మొత్తం దీపారాధన చేసిన ఫలితాన్ని పొందేలా 365 వత్తులతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

# ఘనంగా కార్తీక పౌర్ణమి



ఆలేరు, నవంబర్ 27(తీన్మార్ న్యూస్): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో నీ దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అదేవిధంగా కొలనుపాక సోమేశ్వర ఆలయం లో స్వయంభు సోమేశ్వరునికి ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి కోటక్క లింగం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమేశ్వరాలయానికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంకాల వేళ ఇంటి ముందు దీపాలు వెలిగించారు.

## అంగరంగ వైభవంగా కల్యాణోత్సవాలు

పెనుగంచిప్రోలు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిట కొంగు బంగారమైన పెనుగంచి ప్రోలు తిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాలు (పెద్దతిరునాళ్ల ) నేటి నుంచి 20 వ తేదీ వరకు జరగనున్నాయి. గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణంతో పాటు 41 రోజుల శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు పాటు మండల దీక్ష చేపట్టిన వేలాది మంది స్వాములు తిరుముడి సమర్పించి దీక్ష విరమించేం దుకు తగిన ఏర్పాటు ఆలయ అధికారులు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అమ్మవారి కల్యాణానికి తరలివచ్చే అవకాశం ఉంది .. తిరుపతమ్మ ఆలయ స్థల పురాణం..17వ శతాబ్దంలో పవిత్ర మునేటి తీరాన కొల్లా శివ రామయ్య , రంగమాంబ దంపతులకు ఏడుకొండలవాడి వర ప్రసాదంగా తిరుపతమ్మ జన్మిస్తుంది . పెనుగంచిప్రోలులోని కాకాని కృష్ణయ్య , వెంగమాంబ దంపతుల కుమారుడు గోపయ్యను వివాహం చేసుకున్న తిరుపతమ్మ రాకతో ఆ ప్రాంతమంతా సుభిక్షంగా వర్ధిల్లుతుంటుంది .అయితే అనుకోకుండా ఒకనాడు ఎండలు పెరిగి .. పాడిపంటలు కరువై .. కరువు విలయ తాండవం చేస్తుంది. దీంతో పశుగ్రాసం కోసం గోపయ్య గోవులను తోలుకొని అడవికి వెళ్తాడు . ఈసమయంలో అత్త , తోటికోడలు ఆరళ్లకు తోడు భయంకరమైన కుష్ఠ వ్యాధితో బాధ పడుతున్న తిరుపతమ్మను పశువుల పాకకు గెంటి వేస్తారు పశువుల శాలలో దీన స్థితిలో ఉన్న ఆమెకు పాపమాంబ అనే ముదిరాజ్ కులానికి చెందిన సేవకురాలు సేవలందిస్తుంది. అడవికి వెళ్లిన గోపయ్య పులి దాడిలో మరణించాడని తెలుసుకున్న తిరుపతమ్మ తన అవతార సమాప్తిని గ్రహించి గ్రామాధి కారులు,ప్రజలకు తన మహిమలను తెలుపుతుంది. భర్తతో పాటు సహగమనం చేస్తుంది. ఆతరువాతకాలంలో అదే ప్రాంతంలో గోపయ్య సమేత తిరుపతమ్మ విగ్రహాలతో పాటు,కుంకుమ భరిణ దొరికాయని , ఆప్రాంతంలోనే ఆలయం నిర్మించారని భక్తులు చెబుతారు. ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమి , పాల్గుణ పౌర్ణమికి రెండు సార్లు ఐదు రోజులపాటు తిరునాళ్ల నిర్వహిస్తారు. కుష్ఠు రోగిగా ఉన్న తిరుపతమ్మకు సేవలు చేసిన పాపమాంబ , వంశీయులే నేటికీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు .నిత్యంవేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని సేవించి తరిస్తున్నారు . క్షేత్రం చేరుకోవటానికి మార్గాలు ... పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం చేరుకోవటానికి విజ యవాడ నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి.

## తేజ రకం మిర్చి క్వింటాల్ రూ.25,550

ఖమ్మం:ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం కొత్త మిర్చి రికార్డు స్థాయి ధర పలికింది. క్వింటాల్ మిర్చిని రూ.25,550 పెట్టి కొన్నారు. ఖమ్మం మార్కెట్ చరిత్రలో తేజ రకానికి ఇదే హయ్యస్ట్ రేటు అని అధికారులు తెలిపారు. మొత్తం 20 వేల బస్తాల మిర్చి రాగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పాల్గొని గ్రామానికి చెందిన అచ్చ శ్రీను అనే రైతు 40 క్వింటాళ్ల తేజ రకం కొత్త పంటను మార్కెట్‌కు తీసుకువచ్చాడు. క్వింటాల్ రూ.25,550 పలకడంతో ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా మంత్రి అజయ్ మాట్లాడుతూ.. ఖమ్మం మార్కెట్ ను అంతర్జాతీయంగా చిల్లీస్ హబ్ గా చేస్తామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం లాభసాటిగా మారిందని అన్నారు.

# నవ భారత నిర్మాణం జరగాలి

**– ఆర్థిక వనరులు అందరికీ అందాలి**
**– రోడ్ రోలర్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి**
**– పాలేరు స్వతంత్ర అభ్యర్థి అమరగాని మల్సూర్ గౌడ్**



పాలేరు ప్రతినిధి, నవంబర్ 27(తీన్మార్ న్యూస్): తనను గెలిపిస్తే పాలేరు ప్రజలకు, యువతకు అండగా నిలబడతా ఓటర్ల పిల్లల భవిష్యత్ కోసం పాటుపడుతానని విద్యావంతుడు, హైకోర్టు న్యాయవాది పాలేరు స్వతంత్ర అభ్యర్థి అమరగాని మల్సూర్ గౌడ్ అన్నారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తన ఎన్నికల మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో నాయకులు వస్తున్నారు పోతున్నారు. కానీ మన పిల్లల భవిష్యత్ కోసం ఎవరు ఆలోచన చేయడం లేదు. పదవ తరగతి వరకు ఎటువంటి ఎగ్జామ్స్ పాస్ ఫెయిల్తో సంబంధం లేకుండా ఇండియన్ ఆర్మీలో 5ఏళ్ళ నుండి 10ఏళ్ళ వరకు అర్మీలోఉద్యోగం ఇవ్వాలి. దీని వల్ల యువతలో క్రమశిక్షణ అలవడడం తో పాటు నిజాయితీ గల పౌరుడు గా తయారై అభివృద్ధి చెందిన భారత దేశాన్ని చూడవచ్చు అన్నారు. అలాగే రైతులకు ఉచిత విత్తనాలు, ఎరువులు అందిస్థానాన్ని అన్నారు. ఓటరు కూడా డబ్బులకు అమ్ముడు పోకుండా తమ పిల్లల భవిష్యత్ కోసం ఆలోచనా చేసి పాలేరు నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన రోడ్ రోలర్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు అమరగాని మల్సూరు గౌడ్ విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా పాలేరు ప్రజల తరుపున పోరాడుతానని అన్నారు. అలాగే ఆర్థిక వనరులు అందరికీ అందాలనే లక్ష్యంతో పని చేస్తానన్నారు.

# ప్రయాణం దయనీయం..



సంగారెడ్డి :రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతలయంగా మారాయి. చాలా చోట్ల కంకర తేలి అధ్వానంగా మారాయి. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం పనులు చేపట్టడానికి అనువైన కాలం. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లాలోని పీఆర్, ఆర్‌అండ్‌బీ రహదారులపై దృష్టి .సదాశివపేట మండలం ఆత్మకూర్ నుంచి సింగూరు ప్రాజెక్టుకు వెళ్లే దారిపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. అదే మండలం నిజాంపూర్–వెల్టూర్, సదాశివపేట–వెంకటాపూర్, సదాశివపేట–తంగేడుపల్లి, కంబాలపల్లి రోడ్లదీ ఇదే పరిస్థితి. అందోలు మండలం కిచ్చన్నపల్లి మార్గంలో రెండు కిలో మీటర్ల మేర తారు లేచి.. కంకర తేలింది. దానంపల్లిలో వంతెన వద్ద గుంతలు ఏర్పడ్డాయి. చందంపేట, చింతకుంట మార్గాల్లోనూ ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కొండాపూర్ మండలం తొగర్‌పల్లి వరకు ఇటీవల తారు వేశారు. ఆ తర్వాత అనంత సాగర్ వరకు 12 కిలో మీటర్ల మేర రోడ్డంతా అధ్వానంగా మారింది. కొండాపూర్–తెర్పోల్ మార్గంలో వంతెన వద్ద భారీ గుంతలున్నాయి.

# బీఆర్ఎస్ లో భారీగా చేరికలు

**- బీజేపీ, కాంగ్రెస్‌ను వివిధ పార్టీ లను వీడి గులాబీ గూటికి**

**- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**

**- కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ**



ఇబ్రహీంపట్నం, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజు యాచారం మండలం, మొండిగౌరెల్లి గ్రామం నుండి కాంగ్రెస్ పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు మండల అద్యక్షులు రమేష్ గౌడ్ అద్వర్యం లో, రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి సమక్షం లో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. పార్టీలోకి చేరిన వారిని గులాబీ కండువాలు కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మట్లాడుతూ ఇప్పటికే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరాలని ఉత్సాహంతో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక బలమైన శక్తి అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన గుర్తు చేశారు. దేశంలో సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ప్రజలకు అండగా ఉండే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో మొండిగౌరెల్లి గ్రామ సర్పంచ్ బండి మీది కృష్ణ మాదిగ, గ్రామ అధ్యక్షులు కట్టల కృష్ణయ్య, మండల నాయకులు తాండ్ర శివలింగం, ఉపాధ్యక్షులు దేరంగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు నక్క బాలరాజ్, మస్కూరి స్వామి, గౌరోజు శ్రీనివాస్ చారి, బెగర్ గణేష్, గజ్జల కృష్ణ, వార్డు మెంబర్ మౌనిక ప్రహ్లాద్, సోషల్ మీడియా కన్వీనర్ చెట్టుపల్లి రాజు, కొప్పుల శంకరయ్య, ఎట్టి లింగం, మండల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# జోరెత్తిన బీఆర్ఎస్ ప్రచారం

**- బీఆర్ఎస్ దూకుడు ప్రచారంతో ప్రతిపక్షాలు స్లో డౌన్**






ఇబ్రహీంపట్నం, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రోజు కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ, గౌరెల్లి,బాచారం గ్రామాలలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి రోడ్ షో నిర్వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సేవకుడని, అత్యధిక పించన్లు ఇచ్చి వృద్ధులను ఆదుకుంటున్నారని, రైతు బంధు తో రైతులకు సహాయ పడుతున్నారని, దళిత బంధు ద్వారా దళితుల కుటుంబాలను ఆదుకుంటున్నారని, ఇలా చెప్పుకుంటే అన్ని వర్గాలకు అండగా నిలబడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజల మ్యానిఫెస్టో అని, దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఇందులో కేసీఆర్ భీమా ప్రతి ఇంటికి బీమా పథకం చారిత్మత్మకమైన పథకం అన్నారు. ఈ పథకం అమలు అయితే రాష్ట్రంలోని 90 లక్షల మంది పేద కుటుంబాలకు దీమాగా నిలుస్తుందని వారు తెలిపారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో లక్షలాది మంది రైతులకు రైతు బీమాను ప్రభుత్వం అందజేసింది అని, రైతు మరణిస్తే రైతు బీమా ఐదు లక్షల రూపాయలు వారి కుటుంబాలకు భరోసాగా అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వమే ఏటా నాలుగువేల కోట్ల ప్రీమియం చెల్లిస్తున్నదన్నారు. అయితే కొత్తగా అమలు చేస్తున్న మ్యానిఫెస్టోలో ప్రకటించిన కేసీఆర్ బీమా పేదింటికి బీమానిస్తున్నదని తెలిపారు. శ్రామిక వర్గాలు,ఇతర పనులు చేసుకునే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుంది అన్నారు. పింఛన్లలో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా దివ్యాంగులకు ఇస్తున్న రూ.4016 ను దశలవారీగా రూ.6,016కు పెంచుతామని, ఆసరా పెన్షన్ రూ 2016,సైతం దశలవారీగా రూ.5,016 పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పేదలకు కుటుంబాలకు 400 కే సిలిండర్ అందజేస్తామన్నారు. మళ్ళీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న ప్రతి పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తామని మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ యొక్క కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, దండెం రాంరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తధితరులు పాల్గొన్నారు.

# ఎంసీఎంసీ అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదు

**- కలెక్టర్ భారతి హొలికెరీ**



ఇబ్రహీంపట్నం, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్ కు ఒక రోజు ముందు అనగా ఈ నెల 29, 30 తేదీలలో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ భారతి హొలికెరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా సరే ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేని పక్షంలో ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తనకున్న అధికారాలను వినియోగిస్తూ తగు చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 29,30 తేదీలలో ప్రింట్ మీడియాలో (ఆయా పత్రికలలో) ఎన్నికల ప్రచార ప్రకనటలు ప్రచురితం చేయదలచిన వారు తప్పనిసరిగా ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేషపూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు.

# ఇసుక తవ్వకాలను అడ్డుకున్న రైతులు!



కలికిరి: బాహుదా నదిలో విచ్చలవిడిగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై ఆగ్రహించిన పరిసర గ్రామాల రైతులు ఇసుక రవాణా వాహనాలను మేడికుర్తి సమీపంలో అడ్డుకున్నారు. దీంతో రైతులు, ఇసుక వాహనదారుల మధ్య కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో బాహుదా నది వద్దకు చేరుకున్నారు. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేకపోవడం, అసలు తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో ఇసుక రీచ్‌కు గుర్తింపు లేదని తేలడంతో టిప్పర్లు, ట్రాక్టర్లు తీసుకుని వాహనదారులు అక్కడి నుంచి జారుకున్నారు. చివరికి రైతుల అభ్యర్థనతో ఇసుక వాహనాలు నదిలోకి రాకుండా ఎస్ఐ లోకేష్ రెడ్డి దగ్గరుండి ఎక్స్‌కవేటర్‌తో కాలువ తవ్వించారు.నదిలోనే తవ్వకాలు జరిపి నిల్వ ఉంచిన దాదాపు 5 వేల టన్నుల భారీ ఇసుక దంప్‌ను రైతుల ఒత్తిడితో వీఆర్వో శంకరయ్య స్వాధీనం చేసుకున్నారు. బాహుదా నదిలో మేడికుర్తి వద్ద గతంలో ఇసుక రీచ్‌ను అధికారులు గుర్తించారు. కొద్ది కాలం అధికారికంగా తవ్వకాలు కూడా జరిగాయి. అయితే రైతులు ఫిర్యాదు చేయడంతో అప్పటి సబ్ కలెక్టరు చేకూరి కీర్తి రీచ్ పరిసరాలను పరిశీలించారు.నది మీద నిర్మించిన ఆర్‌అండ్‌బీ బ్రిడ్జికి అటు ఇటు 500 మీటర్లు ఇసుక తవ్వకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాకుండా మరోవైపు నమాజు కట్టవద్ద బాహుదా నది మీద గతంలో చెక్‌డ్యాం నిర్మించారు. చెక్‌డ్యాంకు అటు ఇటుగా 500 మీటర్ల వరకూ ఇసుక తవ్వకాలు జరపకూడదంటూ నీటిపారుదల శాఖ అధికారులు నిషేధం విధించారు. వివిధ రకాల నిషేధాజ్ఞల కారణంగా మేడికుర్తి రీచ్‌లో గత రెండేళ్ల నుంచి ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి.సబ్ కలెక్టరు ఉత్తర్వులను కూడా విస్మరించి ఇటీవల కాలంలో తిరిగి తవ్వకాలు మొదలైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక తరలింపు పరాకాష్టకు చేరుకుంది. ఇటు రహదారి బ్రిడ్జికి,అటు చెక్‌డ్యాంకు ముప్పు సమీపించడంతో పరిసర గ్రామాల రైతులు మూకుమ్మడిగా బాహుదా నది వద్దకు చేరుకుని ఇసుక వాహనాలను అడ్డుకోవడంతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారుల కుమ్మక్కుతోనే ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు సాగుతున్నాయ ని రైతులు ఆరోపించారు.

# పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హొలీకేరీ**

**-ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**

**-పోలింగ్ అనంతరం ఈవిఎం యంత్రాల తరలింపుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్**



ఇబ్రహీంపట్నం, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందిగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భారతి హొలీకేరీ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ,ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవిఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్ లకు పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్ లో భాగస్వామ్యం చేసేలా, ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సదుపాయాలను సరి చూసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయం నవంబర్ 28 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని, అనంతరం 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాల్సి ఉంటుందని అన్నారు. ప్రతిఅసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనల పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు,అభ్యర్థులకు సమాచారం అందించాలని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు తిరిగి వెళ్లేలాచూడాలని అన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్‌కు ఈవిఎం యంత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు.పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలని, అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటమిని అంగీకరించి కేటీఆర్ నాపైన కక్ష కట్టాడు

**- సి విజిల్ లో ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం**

**- సిరిసిల్లలో కేటీఆర్ కు కేంద్ర ఎన్నికల సంఘం సహకరిస్తుంది**

**- కేటీఆర్ కు ఓ న్యాయం, మాకు న్యాయమా...?**

**- కేటీఆర్ కు సుమారు 400 ఫ్లెక్సీల అనుమతి**

**- పత్తిపాక సురేష్ ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలింపు**



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27(తీన్మార్ న్యూస్): సిరిసిల్లలో కేంద్రా ఎన్నికల సంఘం సహకరిస్తుందని ఏఐఎఫ్బి ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాక సురేష్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోఉద్రిక్తత నెలకొంది. సిరిసిల్ల మున్సిపల్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రతిపాక సురేష్ ఫ్లెక్సీలను తొలగించారని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. ఎలక్షన్ కమిషన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నాను విరమించుకోవాలని ప్రయత్నాలు చేశారు. పోలీసు అధికారుల కు ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎఐఎఫ్బి అభ్యర్థి పట్టణ పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో కేంద్ర ఎన్నికల సంఘం కేటీఆర్ కు అన్ని విధాలా సహకరిస్తుందని, ఆరోపించారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఫ్లెక్సీలు తొలగించారని మండిపడ్డారు. మాకేమో రెండు రోజులకి 5 ఫ్లెక్సీలు అనుమతి ఇవ్వగా, సిరిసిల్ల లో ఊరుపోడువున కేటీఆర్‌కు సుమారు 400 ఫ్లెక్సీలకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చరవాణిలో మున్సిపల్ కమిషనర్‌కు, ఆర్డీవోను అడగగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదని, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ మాటలు దాటు వేశారని వాపోయారు. ఒక అభ్యర్థి అయిన కేటీఆర్ కు ఇన్ని ఫ్లెక్సీలకు అనుమతి ఇవ్వడం పై మండిపడ్డారు. సామాన్యులకు ఒక న్యాయం కేటీఆర్‌కు న్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో కేటీఆర్ పూర్తి వ్యతిరేకత మొదలైందని అన్నారు. ఎన్నికలు ఆయనకు చివరి ఎన్నికలుగా మిగులుతాయని సురేష్ హెచ్చరించారు. సి విజిల్‌లో ఫిర్యాదు చేసిన ఎన్నికల కమీషన్ కూడా సరిగా పనిచేస్తాలేదు అని స్థానికులు అనుకుంటున్నారు.

# రికార్డు స్థాయిలో విద్యుత్తు వెలుగులు



అమరావతి: నాగార్జునసాగర్ కుడిగట్టుపై ఉన్న జల విద్యుత్ కేంద్రం ఈ ఏడాది (మార్చి 1 నాటికి) రికార్డు స్థాయిలో 283.513 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి కొత్త మైలురాయిని చేరుకుంది. కుడిగట్టు విద్యుత్తు కేంద్రం స్థాపించి ఫిబ్రవరి 25 నాటికి 40 ఏళ్లు పూర్తయిన వేళ ఈ రికార్డు సాధించడం విశేషం. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా విద్యుత్తు ఉత్పత్తి జరగడంతో ఈ ఘనత సాధించారు. నాగార్జునసాగర్ జలాశయంలో 530 అడుగులపైన నీటి నిల్వలున్నప్పుడు సాగర్ కుడికాలువ కింద అవసరాలకు కుడిగట్టు విద్యుత్తు కేంద్రం నుంచి తీసుకుంటున్నారు. విద్యుత్తు కేంద్రం నుంచి 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే వెసులుబాటు ఉంది. అయితే కుడికాలువ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులే కావడంతో ఆ మేరకే నీటిని వదులుతున్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాగర్ కుడికాలువ కింద తాగు, సాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేసే క్రమంలో డ్యామ్‌లో 530 అడుగులపైన నిల్వలు ఉండటంతో పవర్‌హౌస్ ద్వారా నీటిని వాడుకున్నారు. దీంతో వేసవిలో (ఏప్రిల్, మే నెలల్లో)నూ కొంతమేర విద్యుత్తు ఉత్పత్తి చేశారు. జూన్ నుంచి నదికి వరద నీరు రావడంతో కాలువకు నిరంతరాయంగా నీటిని విడుదల చేస్తుండటంతో విద్యుత్తు ఉత్పత్తి కొనసాగుతోంది. నాగార్జునసాగర్ కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 1983 ఫిబ్రవరి 25న ఉత్పత్తి మొదలైంది. గత నెల 25 నాటికి 40 ఏళ్లు పూర్తయింది. ప్రారంభించినప్పటి నుంచి ఈ మార్చి వరకు మొత్తం 6,032.533 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. 2006-07లో అత్యధికంగా 283.512 మిలియన్ యూనిట్ల ఉత్పత్తితో ఈ కేంద్రం రికార్డు సృష్టించింది. దాన్ని అధిగమిస్తూ ఈ నెల 1న 283.513 మిలియన్ యూనిట్ల మైలురాయిని చేరుకుంది. కుడికాలువకు నీటివిడుదల కొనసాగుతున్నందున ఇంకా ఉత్పత్తి జరుగుతోంది. నిరంతర పర్యవేక్షణ, విద్యుదుత్పత్తికి అంతరాయం కలగకుండా కాలువ అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయడంతో రికార్డు స్థాయిలో ఉత్పత్తి సాధ్యమైందని జెన్‌కో ఇంజినీర్లు తెలిపారు.

# పల్లెల్ని ముంచెత్తుతున్న గుట్కా



మార్కాపురం : జిల్లాలోని మారుమూల పల్లెల్నీ గుట్కా ముంచెత్తుతోంది. న్యాయస్థానం ఉత్తర్వులున్నాయంటూ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌అధికారులు గత కొంతకాలంగా ఉదాసీనంగా ఉండడంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. బడ్డీ మొదలు సరకుల దుకాణం వరకు అన్నిచోట్లా అమ్మకాలు సాగుతున్నాయి. ప్రతి నెలా రూ.10 కోట్ల వరకూ వ్యాపారం జరుగుతున్నా అధికార యంత్రాంగం గుట్కా కట్టడికి తీసుకుంటున్న చర్యలు శూన్యం. జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి రూ.కోట్ల విలువ చేసే గుట్కా, పాన్ మసాలను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇటు పోలీసులు,అటు ఆహార తనిఖీ అధికారులు పట్టించు కోకపోవడంతో అక్రమార్కులు ఆడింది ఆట .. పాడింది పాటగా మారింది. జిల్లాకుఅధిక శాతం బెంగళూరు,చెన్నై తదితర ప్రాంతాల నుంచి గుట్కా వస్తోంది. ఇతర సరకుల మాటున వీటిని తీసుకొస్తున్నట్లు తనిఖీల్లో స్పష్టమవుతోంది. అయితే ఆహారభద్రత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో పశ్చిమ ప్రాంతంలో అక్ర మార్కులు పెద్దఎత్తున విక్రయాలు చేపడుతూ రూ. కోట్లు సంపాదిస్తున్నారు. తమకున్న పరిచయాలతో పోలీసు,సెబ్ అధికారులను దారిలోకి తెచ్చుకుని కార్యకలాపాలు నడిపిస్తున్నారు. దీంతో సరకు నిల్వ కేంద్రాల వైపు యంత్రాంగం కన్నెత్తి చూడడం లేదు. పశ్చిమ ప్రకాశంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఓ అధికారి కనుసన్నల్లో మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఈఅక్రమ వ్యాపారం సాగుతున్న ట్లు తెలుస్తోంది.

# ఏపీతో పాటు మహారాష్ట్రలో గొర్రెలను కొనుగోలు..!



నిజామాబాద్, : జిల్లాకు రెండో విడత గొర్రెలు రానున్నాయి. జిల్లాలోని గొల్లకుర్మలకు గొర్రెలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి గొర్రెలను కొనుగోలు చేసి లబ్ధి దారులకు అందించనున్నారు. ఈ కొనుగోలు కోసం రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించనున్నారు. ఏపీతో పాటు మహారాష్ట్రలో గొర్రెలను కొనుగోలు చేసి అందించనున్నారు. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న రెండో విడత లబ్ధిదారులందరికీ ఈ దఫా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు రెండో విడత కింద గొల్లకుర్మలకు గొర్రెలను అందించేందుకు సిద్ధం కావడంతో అధికారులు ఏర్పాట్ల లో నిమగ్నమయ్యారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు గొర్రెల కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొదటి విడత ఆర్థిక సంవత్సరంలో 8522 మంది లబ్ధిదారులకు అందించారు. జిల్లాలో మొదటి విడత కింద సుమారు 120 కోట్ల వరకు గొర్రెల యూనిట్లకు వెచ్చించారు. ప్రతి లబ్ధి దారునికి 20గొర్రెలు, ఒక పొట్టేలు అందిం చారు. జిల్లాలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎంపిక చేసిన 9475 మంది లబ్ధిదారులకు రెండో విడత కింద గొర్రెలను అం దించేందుకు నిర్ణయించారు. వివిధ కారణాలతో గొర్రెలను 2200 మంది లబ్ధిదారులకు మాత్రమే రెండో విడత కింద ఇచ్చారు. మిగతా వారికి అప్పటి నుంచి ఇప్పటి వరకు అందించలేదు. జిల్లాలో మొదటి విడత కింద గొల్లకుర్మలకు గొర్రెలు అందించిన సమయంలో యూనిట్ కాస్ట్ లక్షా 25వేలుగా నిర్ణయించారు. లబ్ధిదారుని వాటా 25శాతం డీడీ కింద తీసుకుని 75శాతం సబ్సిడీ కింద ప్రభుత్వమే నిధులు సమకూర్చి గొర్రెల యూనిట్లను మంజూరు చేశారు. ఏపీలోని కర్నూల్, అనంతపూర్, కడప జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేసి సరఫరా చేశారు. ఈ ఐదేళ్లలో గొర్రెల ధరలు పెరగడంతో యూనిట్ కాస్ట్ లక్షా 25వేల నుంచి లక్షా 75వేల రూపాయలకు పెం చారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల నుంచి పెంచిన యూనిట్ కాస్ట్‌కు అనుగుణంగా లబ్ధిదారుని వాటాను డీడీల రూపంలో తీసుకుంటున్నారు. ప్రభుత్వం వివిధ కారణాలతో ఇప్పటి వరకు రెండో విడత లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయలేదు. అన్ని అనుకూలించడంతో బడ్జెట్‌లో నిధులు కే టాయించిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి లబ్ధిదారులకు యూనిట్‌లను కొని అందిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. ఇప్పటి రాష్ట్ర స్థాయిలో పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. టెక్నికల్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో గొర్రెల యూనిట్‌లను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఏపీలోని అనంతపూర్, కర్నూల్, గుంటూర్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుంచి కొనుగోలు చేసి అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభు త్వం విడుదల చేసే నిధులకు అనుగుణంగా గొర్రెల యూనిట్‌లను కొనుగోలు చేసి అందించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడం మంత్రి సమీక్షలు నిర్వ హించి నిర్ణయం తీసుకోవడంతో ఈ నెలాఖరులోపు గైడ్‌లైన్స్ విడుదలచేసి వచ్చే నెల నుంచి కొనుగోలు చేపట్టనున్నారని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. గైడ్‌లైన్స్ విడుదలైన తర్వాత లబ్ధిదారులకు విడతల వారీగా అం దించే అవకాశం ఉంద ని అధికారులు తెలిపారు.

# బాలల ఆరోగ్యం.. పోషకాహారంతో అభయం



నార్నూర్, : చిన్నారులే జాతి సంపద.. రేపటి పౌరులు ఆరోగ్యంగా ఉండడం ప్రధానం. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తున్న నార్నూర్, గాదిగూడ మండలాల్లో పోషణ లోపంతో సతమవుతున్న చిన్నారులు ఎంతో మంది ఉన్నారు. సమస్య నుంచి బయటపడేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పంపిణీ చేయిస్తోంది. మరోవైపు ఇక్కడికి రాని వారికి ఉపయోగపడేలా ప్రభుత్వం పోషణ సంబురాలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వ తేదీ వరకు పక్షోత్సవాల పేరిట ఆయా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నార్నూర్ మండలంలో 154 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 343 మంది ఆరు నెలలలోపు చిన్నారులు, మూడేళ్లలోపు 2192 మంది, ఆరు ఏళ్లలోపు 2850 మంది, 391 మంది గర్భిణులు 388 మంది బాలింతలు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ ఆరోగ్య సమాజానికి చైతన్యం తీసుకొచ్చేందుకు 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు కొనసాగిస్తారు. ఇందులో భాగంగా పోషక లోపంతో తలెత్తే పలు అంశాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. చిన్నారులు ఎదగాలంటే విటమిన్లు, ఐరన్ సమృద్ధిగా ఉన్న పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి. పాలు, నూనె ఇంకా అయోడిన్ ఉప్పు నాలుగు నెలల్లో మొదలు పెట్టి. ఆరో నెల వచ్చే వరకు రోజూ ఒక ఎరుపు రంగు ఐఎస్ఏ మాత్ర వేసుకోవాలి. వైద్యులు సూచించిన కాల్షియం మాత్రలు వేసుకోవాలి. స్వచ్ఛమైన నీటిని తాగాలి. గర్భిణులు ప్రసవానికి ముందు కనీసం నాలుగు సార్లు ఏఎస్‌సీ పరీక్షలు చేయించుకోవాలి, బిడ్డకు ఆరు నెలలు వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలి. ఆ తర్వాత అదనపు ఆహారం ఇవ్వాలి. ఐదేళ్ల వరకు అన్ని టీకాలు క్రమం తప్పకుండా వేయించాలి. తమ బిడ్డలకు పాలు కూడా పట్టే సమయం కూడా తల్లులకు ఉండడం లేదు. డబ్బాపాలు పట్టడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల లోపిస్తోంది. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ అంశంపై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే వారోత్సవాలతోనే సరిపెట్టకుండా తల్లిపాల ప్రాధాన్యంపై నిరంతరం అవగాహన కల్పిస్తేనే సత్ఫలితాలు ఉండే అవకాశం ఉంటుంది. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతమేలు చేస్తాయో తెలియనిది కాదు. వీటిని తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ మేరకు ప్రయోజనాలు, వినియోగంపై చైతన్యం తీసుకు వచ్చేలా ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ సారి పోషణ్ పక్షోత్సవాల్లో సదరు అంశానికి ప్రాధాన్యం ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# గుప్పుమంటున్న గుడుంబా?




సూర్యాపేట :అనేకమంది జీవనోపాధిగా మార్చుకుంటున్నారు. అదేవిధంగా నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక రవాణా జోరుగా సాగుతోంది. ప్రతి రోజూ లక్షల్లో విక్రయాలు సాగుతున్నాయి. ప్రధానంగా కృష్ణా పరివాహక ప్రాంతంలో గుడుంబా తయారీ ఎక్కువగా ఉంది. సారా నియంత్రణకు ప్రభుత్వం కొన్నేళ్ల కిందట ప్రత్యేకచర్యలు చేపట్టింది. నాటుసారా తయారీ, విక్రయాలపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను గుర్తించి అధికారులతో వారికి అవగాహన కల్పించింది. గుడుంబా పునరావాస పథకం కింద జిల్లావ్యాప్తంగా సుమారు 300 మందికి అధికారులు ఉపాధి కల్పించారు. కొన్నాళ్ల పాటు జిల్లాలో సారా తయారీ, విక్రయాలు తగ్గినా ఇటీవల పెద్దఎత్తున సాగుతోంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు ఇటీవల దాడులు చేసి పెద్దఎత్తున నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి కృష్ణానదీ పరివాహక ప్రాంతాలైన పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెం, మేళ్లచెర్వు మండలాలు కేంద్రాలుగా మారాయి. ఆ యా ప్రాంతాలతో పాటు సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, నూతనకల్, అర్వపల్లి, మద్దిరాల, మోతె, అనంతగిరి మండలాల్లోనూ యథేచ్ఛగా సారా తయారవుతోంది. పెన్‌పహాడ్ మండలంలోని పలుతండాల్లో నాటుసారా తయారీ బట్టీలు ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నల్లబెల్లం, పటిక జోరుగా రవాణా అవుతోంది. హైదరాబాద్ నుంచి వివిధ మార్గాల్లో జిల్లా కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి సారా తయారీదారులకు వెళ్తోంది. అధికారుల కన్నుగప్పి బైక్‌లు, ఆటోల్లో సారా తీసుకెళ్తున్నారు. అదేవిధం గా నల్లబెల్లం విషయంలో ఆంక్షలు ఉండడంతో తెల్లబెల్లా న్ని కిరాణా దుకాణాల్లో కొనుగో లు చేసి దాని ద్వారా సారా తయారుచేస్తున్నారు. మూడేళ్ల కిందట ఎక్సై జ్ అధికారులు తెల్లబెల్లం విక్రయాలపై ఆంక్షలు విధించారు. దుకాణదారులు తెల్లబెల్లాన్ని ఎవరికి విక్రయించారో వారి పూర్తి వివరాలను ప్రతి నెలా ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. ఆ సమయంలో కొంతమేర నాటుసారా తయారీ నియంత్రణలో ఉంది. అడపాదడపా నాటుసారా తయారీ కేంద్రాలపై అధికారులు దాడులు చేపడుతున్నారు. జిల్లాలో పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెట్టి నాటుసారా తయారీ చేసి, ముగ్గురిపై గతేడాది పీడీ యాక్ట్ ప్రయోగించారు. హుజూర్‌నగ ర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలానికి చెందిన బానోతు శ్రీను, బానో తు బాలా, గరిడేపల్లి మండలానికి పేరబోయిన నాగరాజును పీడీయాక్ట్ కింద రిమాండ్‌కు తరలించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో నాటుసారా తయారీ, విక్రయాలను నియంత్రించడంలో నిర్లక్ష్యం వహించిన సీఐ శ్యాంసుందర్‌ను గతేడాది ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అదేవిధంగా రాజకీయ ఒత్తిళ్లతో బైండోవర్ కేసుల్లో జరిమానాలు తక్కువగా విధించి నిర్లిప్తంగా ఉన్నందుకు సస్పెండ్ చేసినట్లు ప్రచారం సాగుతోంది.

# నాణ్యమైన వైద్యం అందిస్తున్న తెలంగాణ సర్కార్




ఖలీల్‌వాడ : తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానల దశదిశ మారిపోయింది. 'నేను రాను బిడ్డో.. సర్కార్ దవాఖానకు' అనే పరిస్థితి నుంచి సర్కారు దవాఖానకే పోదాం అనే విధంగా నిజామా బాద్ జిల్లా ప్రభుత్వ దవాఖాన తయారైంది. కోట్లు ఖర్చు పెట్టి నిరుపేద ప్రజలకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వ దవాఖానలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారు. ఇందులో నిజామాబాద్ దవాఖాన ఏడు అంతస్తులతో కార్పొరేట్ దవాఖానలకు దీటుగా తయారైంది. ఎమ్మెల్సీ కవిత, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో కోట్లు ఖర్చుచేసి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వందలాది ఆపరేషన్లు చేసే ప్రభుత్వ దవాఖాన అనిపించుకున్నది. ఒక్క రోజే 90 ఆపరేషన్లు చేసిన చరిత్ర ప్రభుత్వ దవాఖానకు ఉంది. అంతేకాకుండా క్యాత్‌ల్యాబ్, మోకాళ్ల చిప్పల మార్పిడి, అనేక రకాల ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. ప్రైవేటు దవాఖానలో సైతం చేయలేని క్లిష్టమైన, లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్లను ఉచితంగా చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. అన్ని రోగాలకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉండి నిత్య పర్యవేక్షణలో ప్రభుత్వ దవాఖానలో సేవలు కొనసాగుతున్నాయి. గతంలో దవాఖానను పట్టించుకునేనాథుడే కరువయ్యారు. అలాంటిది రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో ఉండి జాతీయ పుస్కారాలు అందుకున్న ఘనత ప్రభుత్వ దవాఖానకు ఉంది. నాణ్యతకు మారుపేరుగా నిజామాబాద్ దవాఖాన సేవలు అందిస్తున్నారు. గతంలో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానను ఎంసీఐ బృందం సందర్శించినప్పుడు సరైన వసతులు లేకపోవడంతో వైద్యకళాశాలకు అనుమతి ఇవ్వని పరిస్థితి, కానీ.. ఎమ్మెల్సీ కవిత, మంత్రి ప్రశాంత్ రెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లడి ప్రభుత్వ దవాఖానలో కార్పొరేట్ స్థాయిలో ఉండే విధంగా వసతులు కల్పించి జిల్లాకు వైద్యకళాశాలను మంజూరు చేయించారు. దీంతో దవాఖాన దశదిశ మారిపోయింది. నిత్యం రద్దీతో కిటకిటలాడుతున్నది. కరోనా సమయంలో వైద్యులు, సిబ్బంది భయపడకుండా ప్రజల ప్రాణాలే ముఖ్యమనే విధంగా పని చేసి చూపించారు. కరోనా కన్నా ముందు దవాఖానలో సుమారు 1000కి పైగా ఓపీ ఉండేది. కానీ ప్రస్తుతం 1600 మంది ఓపీ వస్తున్నారు. ఇన్‌పేషెంట్లు(ఐపీ) సైతం భారీగా ఉండగా, అందులోనూ అధికంగా మహిళలే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెలలో వీరే 1267 మంది ఉన్నారు. వీరిలో 40 శాతం శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు కావడం గమనార్హం. జిల్లా కేంద్ర దవాఖాన ప్రసవాల్లోనూ అగ్రస్థానంలో నిలుస్తున్నది. నిత్యం పదుల సంఖ్యలో ప్రసవాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నార్మల్ డెలివరీల కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. కొన్ని క్లిష్టమైన కేసుల్లో మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నారు. చిన్నచిన్న జ్వరాల నుంచి టైఫాయిడ్ వరకు వాంతులు, కడుపు, నడుము, తలనొప్పితో చికిత్స పొందే వారితో పాటు మోకీలు మార్పిడి, కణతుల తొలగింపు వంటి అరుదైన శస్త్ర చికిత్సలు చేయించుకునే వారి వరకు ఉంటున్నారు. ముఖ్యంగా గర్భిణుల విషయంలో వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారు. వ్యాయామం చేయిస్తూ నార్మల్ డెలవరీలు చేయించేలా వైద్యులు కష్టపడుతున్నారు. వారి ఆరోగ్యనికి భరోసా కల్పిస్తున్నారు.

# ఐటీ సంస్థలు వర్క్ ఫ్రం హోం కు ముగింపు పలికినట్లేనా?




**హైదరాబాద్, :** గత రెండున్నరేళ్లుగా కరోనా మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోంది. ఈ నేపథ్యంలోనే చాలా కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వడానికి మొగ్గు చూపాయి. కేవలం అత్యవసర సేవలు ఉండే కంపెనీలు తప్ప మిగతావన్నీ సాధ్యమైన మేరకు ఇంటి నుంచి పని చేయడానికి వీలు కల్పించాయి. సుమారుగా మన దేశంలో కరోనా అడుగు పెట్టిన నాటి నుంచి కూడా కంపెనీలు వర్క్ ఫ్రం హోమ్ ఆప్షన్ బెస్ట్ గా దానినే ఫాలో అవుతూ వచ్చాయి. అన్నీ రంగాల మాట అలా ఉంచితే ముఖ్యంగా ఐటీ రంగంలో ఉండే ఉద్యోగులకు ఆయా కంపెనీలు వర్క్ ఫ్రం హోం ఇవ్వడంతో పాటు అందుకు తగిన సౌకర్యాలను కూడా కల్పించాయి. ఇదే దారిలో దేశీయంగా ఉన్న అనేక స్టార్టప్ కంపెనీలు ఇతర సంస్థలు నడిచాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం హైదరాబాద్ లో ఉండే చాలా స్టార్టప్ కంపెనీలు ఇతర ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను తిరిగి ఆఫీస్ నుంచి పని చేయించే విధంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లో ఉన్న ఐటి కంపెనీలు తమ ఉద్యోగులను తిరిగి ఆఫీసుకు రప్పించాలని చూస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఇటీవల తెలంగాణ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు పెట్టిన మీడియా సమావేశమే. రాష్ట్రంలో కొవిడ్ మూడవ వేవ్ ముగిసిందని ఆ సమావేశంలో ఆయన చెప్పుకొచ్చారు. అదేరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్న ఉద్యోగులను ఆయా కంపెనీలు తిరిగి ఆఫీసులకు పిలవాలి అనుకుంటే పిలవచ్చని ఆయన సూచించారు. దీంతో ఇప్పటి వరకు వర్క్ ఫ్రం హోంతో పని కానిస్తున్న ఐటీ కంపెనీలు తిరిగి కంపెనీ నుంచి పని చేసే విధానానికి తెరపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికీ ఉద్యోగులను ఆఫీసులు పిలవడం రిస్క్ తో కూడుకున్నది అయినా కానీ ఇందుకు తగిన జాగ్రత్తలు కూడా ఆయా కంపెనీలు పాటించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కరోనా మహమ్మారి దేశంలో విలయ తాండవం చేసినప్పుడు అనేక కంపెనీలకు వర్క్ ఫ్రం హోం బెస్ట్ ఆప్షన్ గా కనిపించింది. దీంతో అనేక కంపెనీలు ఇందుకు తగ్గట్టుగా పని విధానాన్ని మార్చుకున్నాయి. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. దేశంలో పాజిటివిటీ రేటు కూడా బాగా తగ్గింది. ఇంకా తెలంగాణలో అయితే భారీగా పడిపోయింది.

దీంతో ఉద్యోగులను ఆఫీస్ నుంచి పనిచేయించడానికి కంపెనీలు ఆలోచనలు చేస్తున్నాయి. ఇప్పటికే హైబ్రిడ్ విధానాన్ని పాటిస్తున్న చాలా కంపెనీలు ఈ ఏడాది జనవరిలో ఉద్యోగులను ఆఫీస్ కు పిలవాలని భావించాయి. కానీ అదే సమయంలో దేశవ్యాప్తంగా ఒమిక్రాన్ అడుగు పెట్టింది. దీంతో కేసుల సంఖ్య కేవలం వారం రోజుల్లోనే భారీ స్థాయిలో పెరిగాయి. వ్యాప్తి కూడా ఎక్కువ ఉండడంతో నాడు తీసుకున్న నిర్ణయాన్ని ఆయా సంస్థలు పునరాలోచించి వెనకడుగు వేశాయి. ఈ నేపథ్యంలోనే వర్క్ ఫ్రం హోం మరోమారు పొడిగించాయి. ఇలా ఆ నాడు ఆఫీసుకు పిలవాలి అని భావించిన కంపెనీలు అన్నీ కూడా నేడు ఉద్యోగులను వెనక్కి పిలిపించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

## పూర్వ వైభవం కోసం..

ప్రభుత్వ రంగంలోని ఎయిరిండియాను 69 సంవత్సరాల తర్వాత మళ్ళీ టాటా సన్స్ సంస్థకు కేంద్రం అప్పగించింది. ఎయిరిండియా గడిచిన కొన్ని సంవత్సరాలుగా నష్టాలతో నడుస్తోంది. యూపీఏ హయాంలోనే ఎయిర్‌లైన్స్‌ని ఎయిరిండియాలో విలీనం చేసి ఒకే సంస్థగా నడుపుతున్నారు. అయితే, ఈ సంస్థ నష్టాల ఊబిలో కూరుకుని పోవడం వల్ల వంద శాతం వాటాలను ప్రైవేట్ సంస్థకు అప్పగించడం మినహా గత్యంతరం లేదన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. టాటాగ్రూపు టాటా ఎయిర్ లైన్స్‌ని 1938లో ప్రారంభించింది. 1953లో దానిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మళ్ళీ టాటా సంస్థకే ఎయిరిండియాను అప్పగించడం చరిత్రలో కీలక ఘట్టం. అప్పుడు ఎలాంటి ఉద్వేగ సన్నివేశాలు చోటు చేసుకున్నాయో ఇప్పుడూ అలాంటి సన్నివేశాలే చొటు చేసుకున్నట్టు ఆ సంస్థతో అనుబంధం ఉన్న వారు తెలియజేశారు. టాటా గ్రూపు అనుబంధ సంస్థ ట్యాలెస్ గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన వేలంలో ఎయిర్ ఇండియాను 18వేల కోట్ల రూపాయిలకు సొంతం చేసుకుంది. 2,700 కోట్ల రూపాయిలు నగదు రూపంలో చెల్లించింది. మిగిలిన సొమ్మును రుణాల రూపంలో చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. దేశంలో టాటా గ్రూపు వైమానిక రంగంలో నెలకొల్పిన రికార్డులు అపూర్వమైన. అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్టుగా టాటా ఎయిర్‌లైన్ విమాన సర్వీసులను నడిపింది. ఇప్పుడు మళ్ళీ పూర్వ వైభవాన్నితెచ్చేందుకే ఈ సంస్థను టేకోవర్ చేసినట్టు టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తెలియజేశారు. ఈ సంస్థ నిర్వహణను రతన్ టాటా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారనీ, ఈ సందర్భంగా ఉద్యోగులు, పైలట్లు, అధికారులందరికీ ప్రత్యేక సందేశం ఇచ్చారనీ ప్రయాణీకులకు సంతృప్తికరమైన టాటా కంపెనీ వ్యవస్థాపకుడు జేఆర్‌డీటా టా 1938లో సింగిల్ ఇంజన్ విమానాన్ని ప్రస్తుతం పాక్‌లో ఉన్న కరాచీ నుంచి ముంబాయికి తానే స్వయంగా నడిపారు.

# పేదల జీవితాలపై మట్కా పంజా

మెట్‌పల్లి,:రూపాయికి పది, పదికి వంద, వందకు వెయ్యి.. ఇలా ఎంత పెడితే అంతకు పదింతలు డబ్బు వస్తుందని ఆశ చూపెడుతున్న 'మట్కా' ఆట జగిత్యాల జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. యు వకులు, కూలీలు జూదంతో ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. రూ.5 నుంచి రూ.10ల వడ్డీకి అప్పు చేసి మట్కా ఆడుతున్నారు. అప్పులు తీర్చలేక గతంలో కొందరు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఒకప్పుడు 'బ్రాకెట్' ఆటగా పేరొందిన మట్కా ప్రస్తుతం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. కోరుట్ల, మెట్ పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలతో పాటు పలు మండలాల్లో జోరుగా నడుస్తోంది. పోలీసులకు దొరక్కుండా ఏజెంట్లు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరికి కొందరు పోలీ సులు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ముంబై, పుణే, నాగ్‌పూర్, ధర్మాబాద్, వర్లి ప్రాంతాలు ప్రధాన కేంద్రాలకు అనుబంధంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, పె ర్కిట్ అ డ్డాలుగా జగిత్యాల ఏజెంట్లు గుట్టుచప్పుడు కాకుండా మట్కా వ్యాపారం కొనసాగిస్తున్నా రు. పగలు కళ్యాణ్, రాత్రి ముంబై ఆటలు నడుస్తున్నాయి. కళ్యాణ్‌కు మధ్యాహ్నం 2 గంటల దాకా ఆయా నంబర్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సబ్ ఏజెంట్ల ద్వారా మా త్రమే బెట్టింగ్ కు సంబంధించిన డబ్బులు తీ సుకుంటుంటారు. ముంబై అనే మట్కాకు సంబంధించిన నంబరును, డబ్బులను రా త్రి 8 గంటల దాకా తీసుకుంటుంటారు. గతంలో రహస్యంగా కాగితం చిట్టీలపై నంబర్లతో సాగిన మట్కా దందా సాంకేతికత పెరగడంతో నేడు గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. ప్రస్తుతం చి ట్టీలతో కాకుండా సెల్ ఫోన్లలో, వాట్స్ ఆప్ మెసేజ్ ల ద్వారా ఆన్‌లైన్ లో ఆడుతున్నారు. డబ్బులు సైతం ఆన్ లైన్ ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి మట్కా నిరంతరం కొనసాగుతున్నా పోలీ సులు ఆవైపు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. మట్కా నిర్వాహకులపై నిఘా లేకపోవడంతో వారు ప్రధాన చౌరస్తాలలో తమ పని కానిచ్చేస్తున్నారు. కోరుట్లలోని అల్లమియ్య గుట్ట, యేఖిన్ పూర్, పాత బ స్టాండ్, గోదాం, స్టేడియం, ఐలాపూర్ రోడ్డు, మెట్‌పల్లి పట్టణంలోని అంగడిబజార్, చావిడి చౌరస్తా, కొత్త బస్టాండ్ పరిసరాలు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ప్రధా నంగా మట్కా కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో పాటు పలు వార్డుల్లో మట్కా సబ్ ఏజెంట్లు తిరిగి ఎవరికీ అను మానం రాకుండా డబ్బులు సేకరించి నిర్వా హకులకు అప్పగించి కమీషన్లు పొందుతు న్నట్లు తెలుస్తోంది. మట్కా దాందాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. నిర్వాహకులు, ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జూదానికి అలవాటుపడి ఆర్థికంగా నష్టపోవడంతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయి. చట్ట వ్యతిరేక కా ర్యకలాపాలు నిర్వహిస్తే ఎంతటివారైనా కఠి నంగా వ్యవహరిస్తాం. జూదం నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# చెరుకు సాగుకు రైతులు దూరం!

వనపర్తి :ప్రభుత్వ రాయితీతో ఏర్పాటైన షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో పాలమూరు జిల్లా రైతులు చెరుకు సాగుకు దూరమవుతున్నారు. కరువు జిల్లాగా పేరున్న పాలమూరులో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భారీగా రాయితీలు ప్రకటించింది. ఇందులోభాగంగా వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ రైతులకు ఉపయోగపడడం లేదన్న విమర్శలున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో పాటు ఫ్యాక్టరీ నిర్వహణపై చేతులెత్తేస్తోంది. నష్టాలు వస్తున్నాయంటూ మూసి వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తకోట మండలం రామకృష్ణాపురం, అప్పరాల శివారులో 150 ఎకరాల విస్తీర్ణంలో షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం అనుమతించింది. ఇం దుకు రూ.100 కోట్ల వరకు ఖర్చు కాగా, అందులో సగం సబ్సిడీ కింద మంజూరు చేసింది. అట్టహాసంగా షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించిన యాజమాన్యం ఆ తర్వాత విస్తీర్ణం తగ్గిస్తూ వస్తోంది. 6 లక్షల టన్నుల క్రషింగ్ కెపాసిటీ గల షుగర్ ఫ్యాక్టరీ ప్రస్తుతం 1.50 లక్షల టన్నుల క్రషింగ్ కే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాలో గతంలో 20 వేల ఎకరాల సాగువిస్తీర్ణం ఉండగా, ప్రస్తుతం 8 వేలకు పడిపోయింది. దీంతో జహీరాబాద్ ప్రాంతం నుంచి చెరుకును తెప్పించి, ఇక్కడి చెరుకుతో కలిపి ప్రతి ఏటా 3 లక్షల టన్నులు క్రషింగ్ చేస్తున్నారు. చెరుకు విస్తీర్ణం పెరిగితే కంపెనీకి లాభాలు వస్తాయి. దీంతో రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. కంపెనీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు లాభాలు రాకపోవడంతో టన్నుకు రూ.3,257 మాత్రమే ఇస్తున్నారు. టన్నుకు రూ.5,550 చెల్లించాలని రైతులు చాలా కాలంగా పోరాడుతున్నారు. చెరుకు పండించే రైతులు పంట కోత సమయంలో తిప్పలు పడుతున్నారు. మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ ప్రాంతాలకు చెందిన కూలీలను ఫ్యాక్టరీ యాజమాన్యం రప్పించి కోత పనులు చేయిస్తున్నారు.

# రహదారి విస్తరణకు కొలతలు



వేములవాడ: ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని రాజన్న ఆలయం ముందు ప్రధాన రహదారి విస్తరణ పనులకు మోక్షం లభించనున్నది. దశాబ్దాలుగా పట్టణంలోని రాజన్న ఆలయం ముందు రోడ్డు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ విస్తరణకు మాత్రం నోచుకోవడం లేదు. అధికారులు ఈసారి కొలతలు వేస్తుండటంతో పనులు ముందుకు సాగే అవకాశం ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. గత నాలుగు రోజులుగా టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ), రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ సర్వే అధికారులు రాజన్న ఆలయం ముందు రోడ్డులో విస్తరణ పనుల్లో భాగంగా కొలతలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వేములవాడ చుట్టూ బైపాస్ రహదారుల విస్తరణ జరిగినప్పటికీ రాజన్న ఆలయం ముందు విస్తరించలేదు. దీంతో రాజన్న ఆలయానికి రోజూ వచ్చే భక్తులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలతో నిత్యం వీధులు రద్దీగా ఉంటున్నాయి. ఏదేని పర్వదినాల్లో స్వామివారి దర్శనానికి రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు, వాహనాలు పోటెత్తడంతో రోడ్లన్నీ పద్మవ్యూహాన్ని తలపిస్తుంటాయి. ఇంత రద్దీగా ఉండే వేములవాడ పట్టణంలోని రహదారుల విస్తరణ దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో భక్తులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆలయం ముందు రోడ్డు విస్తరించి అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు కూడా దశాబ్దాలుగా మోక్షం లభించడం లేదు. మొదటి విడతలో మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు 80 అడుగులతో విస్తరించేందుకు అధికారులు కొలతలు వేస్తున్నారు. వంతెన నుంచి ఆలయం వరకు 252 ఇళ్లు విస్తరణలో కోల్పోతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాజన్న ఆలయానికి రోజూ వచ్చే వేలాది మంది భక్తులు, స్థానికులు ఇరుకు రహదారితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని విస్తరిస్తే ఇబ్బందులు పూర్తిగా తొలగనున్నాయి. ఆలయం ముందు రోడ్డు విస్తరణతోనే సమస్యకు పరిష్కారం లభించనుంది. గతంలో ఈ మార్గంలో సర్వే చేసి ఇళ్లకు, దుకాణాలకు అధికారులు మార్కింగ్ చేశారు. అయినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. రహదారి ఇరుకుగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, వారి వాహనాలతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ వేయికి పైగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. మరో పది వేల మందికి పైగా భక్తులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆది, సోమవారాలతో పాటు ఏదేని ఉత్సవాల సందర్భంగా ఈ మార్గంలో వెళ్లాలంటే పద్మవ్యూహాన్ని తలపిస్తుంటుంది. వేములవాడ చుట్టూ బైపాస్ రోడ్ల వెడల్పు పనులు పూర్తయినప్పటికీ గుడి ముందు మాత్రం చేపట్టలేదు. ప్రస్తుతం కొలతలు వేయడంతో ఈసారి రహదారి విస్తరణ పూర్తవుతుందనే ఆశతో భక్తులు, స్థానికులు ఎదురుచూస్తోన్నారు.

# ప్రధాన మార్గం.. ప్రయాణ నరకం?



పెద్దపల్లి :మంథని–కాటారం ప్రధాన రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అంతర్ రాష్ట్ర మార్గమైన ఈ రహదారి మరమ్మతు ప్రతిపాదనలకే పరిమితమైంది. పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. పాడయిన కల్వర్టులు, వంతెనలతో తరచూ వాహనాలు అదుపు తప్పుతున్నాయి. భట్టుపల్లి నుంచి అడవిసోమన్‌పల్లి వరకు అడుగడుగునా గుంతలే కనిపిస్తున్నాయి. భారీ సంఖ్యలో ఇసుక వాహనాల రాకపోకలతో రహదారి ధ్వంసమవుతోంది. రెండు జిల్లాలను అనుసంధానించే అడవిసోమన్‌పల్లి మానేరు వంతెన శిథిలావస్థకు చేరింది. గుంతల రహదారిపై ప్రయాణం ప్రాణ గండంగా మారింది. మంథని నుంచి అడవిసోమన్‌పల్లి వరకు సుమారు 16 కిలోమీటర్ల దూరంలో 3 వంతెనలు, 16 కల్వర్టులున్నాయి. వెంక్లాస్‌పూర్ గాడుదుల గండి గుట్ట, బిట్టుపల్లి సమీపంలోని మరో ఘాట్ రోడ్డు అధ్వానంగా మారింది. ఆరెంద, అడవిసోమన్‌పల్లి సమీపంలోని మలుపుల వద్ద ప్రమాదాలు జరుగు తున్నాయి. ఘాటు రోడ్డు కావడంతో వేగంగా వచ్చి న వాహనాలు బోల్తా పడుతున్నాయి. కల్వర్టులు, మలుపుల వద్ద రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లోనూ కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలకు వెళ్లడానికి అనువుగా ఉండే రహదారిపై అడవిసోమన్‌పల్లి–పీవీనగర్ మానేరు వంతెన శిథిలావస్థకు చేరింది. అప్పట్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని నిర్మించారు. పిల్లర్ల మధ్య స్ప్రింగ్ సిస్టమ్ అమర్చారు. 1971లో నిర్మించిన వంతెనకు శాశ్వత మరమ్మతు కరవైంది. పిల్లర్ల మధ్యలోని ఇనుప చువ్వలు పైకి లేచి పెద్ద గోతులను తలపిస్తున్నాయి. రెండు వైపులా ఉన్న రెయిలింగ్ కూడా విరిగిపోతోంది. రెండు వరుసల రహదారిపై సామర్థ్యానికి మించిన భారంతో ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో రద్దీ పెరిగింది. గుంతలతో ద్విచక్రవాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఆరెంద మలుపు, నాగేపల్లి, అడవిసోమన్‌పల్లి సమీప ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోదావరిఖని నుంచి మంథని మార్గంలో మల్లేపల్లి సమీపంలో రహదారి అధ్వానంగా మారింది. రామగిరి మండలం కల్వచర్ల, బేగంపేట మధ్యలో నిధుల లేమితో పనులు చేయడం లేదు. మంథని మండలం వెంక్లాస్‌పూర్ గాడుదుల గండి ప్రాంతంలో ఆర్టీసీ, కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృత్యువాత పడగా ఆరుగురు గాయపడ్డారు. భట్టుపల్లి సమీపంలోని గుట్ట వద్ద అదుపు తప్పిన వేగంతో కారు బస్సును ఢీకొనడంతో కారు డ్రైవర్ మృతి చెందగా, 12 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాది జనవరి 9న అడవిసోమన్‌పల్లి వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో 16 మందికి గాయాలయ్యాయి. మార్చి 17న భట్టుపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. మంథని– కాటారం మార్గంలో జిల్లా పరిధిలో రహదారి ధ్వంసమైంది. మరమ్మతు కోసం ఏడాది కిందట రూ.50 కోట్లతో ప్రతిపాదించాం. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాం. నిధులు విడుదలయితేనే పనులు మొదలవుతాయి.

# మన కంపెనీలకు..సైబర్

# దాడులను తట్టుకునే సత్తా తక్కువే




జైపూర్: సైబర్‌దాడులను తట్టుకునే విషయంలో ఇండియా కంపెనీలు చాలా బలహీనంగా ఉన్నాయని తాజా స్టడీ ద్వారా వెల్లడయింది. ఇండియాలో 24 శాతం సంస్థల దగ్గర మాత్రమే ఆధునిక సైబర్ సెక్యూరిటీ రిస్కులను ఎదుర్కొనేం దుకు అవసరమైన టెక్నాలజీలు, సాఫ్ట్‌వేర్లు ఉన్నాయని సిస్కో తాజా రిపోర్టు తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇండియా అంతటా రాబోయే మూడేళ్లలో ఐదు లక్షల మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులకు శిక్షణ ఇస్తామని ప్రకటించింది. గ్లోబల్ బిజినెస్ సెక్యూరిటీ లీడర్‌లు తగిన చర్యలు తీసుకోకపోతే సైబర్‌సెక్యూరిటీ దెబ్బతింటుందని సిస్కో సైబర్ సెక్యూరిటీ రెడీనెస్ ఇండెక్స్ స్పష్టం చేసింది. ఇందులోని వివరాల ప్రకారం.. సైబర్ దాడులను ఎదుర్కోవడానికి రెడీ కావడంచాలా ముఖ్యం. స్టడీలో పాల్గొన్నవారిలో 90 శాతం మంది రెస్పాండెంట్లు వచ్చే 12 నుంచి 24 నెలల్లో తమ వ్యాపారానికి సైబర్ సెక్యూరిటీ దాడులు ఎదురవుతాయని భయపడుతున్నారు. సైబర్ సెక్యూరిటీ రెడీనెస్ విషయంలో ప్రపంచ సగటుతో పోలిస్తే ఇండియా 15 శాతానికిపైగా మెరుగైన పనితీరు కనబరిచింది. ఈ సర్వే ద్వారా 27 మార్కెట్లలోని 6,700 మంది ప్రైవేట్ రంగ సైబర్ సెక్యూరిటీ లీడర్ల అభిప్రాయాలను తీసుకున్నారు. ఇండియాలోని సంస్థలు గ్లోబల్ యావరేజ్ కంటే మెరుగ్గా ఉన్నప్పటికీ, వీటికి రిస్కులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఎందుకంటే 80 శాతం మంది రెస్పాండెంట్లు తమ కంప్యూటర్లపై గత 12 నెలల్లో సైబర్ సెక్యూరిటీ దాడి జరిగిందని చెప్పారు. దీని వలన తమకు కనీసం 500,000 డాలర్లు ఖర్చయిందని 53 శాతం మంది తెలిపారు. రెస్పాండెంట్లలో 95 శాతం మంది తమ భద్రతా బడ్జెట్‌లను రాబోయే 12 నెలల్లో కనీసం 10 శాతం పెంచాలని భావిస్తున్నారు.

# పన్ను బకాయిలపై రవాణా శాఖ దృష్టి



మహబూబ్‌నగర్ : పన్ను చెల్లించని వాహనాలను పట్టుకుని కేసు నమో దు చేస్తున్న మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ సంగెం నరేశ్ వాహనాల నుంచి పన్నుల రూపేణా రావాల్సిన ఆదాయంపై రవాణా శాఖ దృష్టి సారించింది. ఇందుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో ట్యాక్సీ నంబరు ప్లేటు కలిగిన వాహనాల పన్నులు జిల్లాలో రూ.కోట్లల్లో పేరుకుపోయాయి. రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లకుండా వాహనదారులు ఆన్‌లైన్ కేంద్రాల్లోనూ చెల్లించే వెసులుబాటు ఉంది. గడవు ముగిసినా త్రైమాసిక పన్ను చెల్లించకపోవటంతో అధికారులు వాహనాలపై నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నారు. కేసులు నమోదైతే పన్నుపై 200 శాతం అదనంగా జరిమానా విధిస్తున్నారు. ట్యాక్సీ ప్లేట్ వాహనాలు 6,166 : జిల్లావ్యాప్తంగా 6,166 వాహనాలకు సంబంధించి రూ.6.45కోట్లకు పైగా పన్ను బకాయిలు ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు గుర్తించారు. మార్చి 31లోగా ఈ మొత్తాన్ని రాబట్టేలా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఫిబ్రవరి నుంచి చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లా రవాణా శాఖ అధికారులు 1,603 వాహనాల నుంచి రూ. 1.71 కోట్ల పన్ను రాబట్టగలిగారు. అధికారులు తనిఖీల్లో 225 వాహనాలను పట్టుకుని రూ. 70.01 లక్షలు వసూలు చేశారు. వాహనదారులు సొంతంగా ఆర్టీవో కార్యాలయం, ఈసేవా, మీసేవా కేంద్రాలకు వెళ్లి రూ.కోటి చెల్లించారు. ఇంకా రూ.4.74 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మార్చి 31 వరకు వసూలు చేసేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలోని మూడు పురపాలికలు, 441 పంచాయతీల వాహనాల పన్నులే రవాణా శాఖకు రూ.2కోట్లకు పైగా బకాయి ఉన్నట్లు అధికారులు లెక్క కట్టారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి కొన్నేళ్లుగా పన్నులు చెల్లించక రవాణా శాఖ ఆదాయానికి గండి పడుతోంది. పురపాలికలు, పంచాయతీలు పన్ను చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. రవాణా శాఖకు త్రైమాసిక వాణిజ్య పన్ను బకాయిలున్న ప్రభుత్వ, ప్రైవేటు అన్ని వాహనాలకు ఇదివరకే నోటీసులు జారీ చేశాం. నేరుగా వచ్చి చెల్లిస్తే జరిమానా అంత పడదు. కేసులు నమోదు చేస్తే 200 శాతం అదనంగా చెల్లించాలి. ముఖ్యంగా పురపాలికలు, పంచాయతీల నుంచి పన్ను బకాయిలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పాత వాహనాలు తక్కు కింద అమ్మినా, ఫైనాన్సు వాళ్లు తీసుకెళ్లినా రవాణా శాఖకు సమాచారం ఇవ్వాలి.

# జాడలేని గ్రావిటీ కెనాల్



జగిత్యాల:జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో ఏటా సాగునీరందక పొలాలు ఎండిపోతున్నాయి. రైతుల విజ్ఞప్తి మేరకు పోతారం రిజర్వాయర్‌ను అనుసంధానం చేస్తూ జేఎన్టీయూ కాలేజీ వరకు 7.5 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జేఎన్టీయూ సమీపంలోని అల్లం కుంట చెరువులోకి నీరు వెళ్లేలా ఆఫీసర్లు డిజైన్ చేశారు. భూసేకరణ కూడా పూర్తయ్యింది. దీని ద్వారా పోతారం, తిర్మలాపూర్, హిమ్మత్ రావుపేట, శనివారంపేట, రాంసాగర్, డబ్బు తిమ్మయ్యపల్లి, పూడూర్, నాచుపల్లి గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాలకు నీరందించాలని నిర్ణయించారు. అయితే కెనాల్ పనులు ముందుకు సాగడంలేదు. ప్రభుత్వ హామీ నెరవేరదంలేదు. 2019 సెప్టెంబర్ 13న మొదటి విడత పల్లె ప్రగతి కార్యక్రమానికి హాజరయ్యేందుకు కొడిమ్యాల మండలంలోని హిమ్మత్ రావుపేటకు వచ్చిన మినిస్టర్లు కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ కాన్వాయ్ ని స్థానిక రైతులు అడ్డుకున్నారు. గ్రావిటీ కెనాల్ ఎప్పుడు నిర్మిస్తారని నిలదీశారు. స్పందించిన మంత్రులు మూడు నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అయినా ఇంతవరకు పూర్తికాలేదు. కానీ... కాన్వాయ్ ని అడ్డుకున్న రైతుల మీద కేసులు నమోదయ్యాయి. ఐదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రావిటీ కెనాల్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి. ఎన్నో ఏండ్ల నుంచి కెనాల్ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నాం. కానీ.. పనులు ప్రారంభం కావడం లేదు. నీళ్లు లేక ఏటా ఆయకట్టు ఎండిపోతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ఏటా పొలాలు ఎండిపోవడంతో గ్రావిటీ కెనాల్ నిర్మించాలని కోరాం. మినిస్టర్ కొప్పుల, ఎర్రబెల్లి కాన్వాయ్ అడ్డుకోవడంతో మూడు నెలల్లో చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికి తట్టెడు మట్టి తీయలేదు. కానీ పోలీసులు పెట్టిన కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం.

# పంచాయతీ భవనాలకు స్థలాల కొరత



నారాయణపేట: జిల్లాలో పలు గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక పాలకులు అవస్థలు పడుతున్నారు. పాలకవర్గ సమావేశాలు నిర్వహించుకోవడానికి కూడా స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త పంచాయతీలు అద్దె గదుల్లో, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో కొనసాగిస్తున్నారు. పాత పంచాయతీల్లో పలు చోట్ల ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరాయి. సొంత భవనాలు సమకూర్చాలని ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు చేసినా గ్రామాల్లో నిర్మాణాలకు స్థలాలు దొరకడం లేదు. దీంతో అయిదారు గ్రామాల్లో మినహా మరెక్కడా సొంత భవన నిర్మాణ పనులు ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు.. : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం నిధులు ఒక్కోదానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయిస్తూ మూడు నెలల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఒక్క గ్రామంలో కూడా పనులు ప్రారంభం కాలేదు. సరైన స్థలాలు దొరకడం లేదని సర్పంచులు పేర్కొంటున్నారు. జిల్లాలో 191 పాత పంచాయతీలు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కిందట 500 జనాభా ఉన్న మజరా గ్రామాలు, గిరిజన తండాలను కూడా పంచాయతీలుగా ప్రకటించడంతో నారాయణపేట జిల్లాలో 89 కొత్త పంచాయతీలు ఏర్పాటు అయ్యాయి. దీంతో మొత్తం పంచాయతీల సంఖ్య 280కి చేరింది. వాటిలో సొంత భవనాలు కలిగి ఉన్నవి కేవలం 179 మాత్రమే. వాటిలో కూడా పాత భవనాలు శిథిలావస్థకు చేరినవి 36 ఉన్నాయి. 45 గ్రామాల్లో కార్యాలయాలను ఇరుగైన అద్దె ఇళ్లల్లో, 56 గ్రామాల్లో పాఠశాల గదులు, కమ్యూనిటీ హాళ్లలో పంచాయతీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. పాత భవనాలు శిథిలావస్థకు చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాలకవర్గాలు మొరపెట్టుకోవడంతో ప్రభుత్వం మొత్తం పంచాయతీలకు సొంత భవనాలు అవసరమో నివేదిక కోరగా.. మొత్తం 137 గ్రామాల వివరాలను జిల్లా అధికారులు నివేదించారు.

# వాగుల్లో వృథాగా పోతున్న

# నీటికి అడ్డుకట్ట వేసిన సర్కారు

కుమ్రం భీం ఆసిఫాబాద్, : జిల్లాలోని వాగులు.. వంకల నుంచి వృథాగా పోతున్న నీటిని పంటలకు మళ్లించే లక్ష్యంతో రాష్ట్ర సర్కారు చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. మూడేళ్ల క్రితం రూ. 22.19 కోట్లతో 6 చెక్ డ్యామ్‌లు నిర్మించగా, 785 ఎకరా లకు సాగునీరందుతున్నది. అలాగే రెండేళ్ల క్రితం మరో రూ.126.70 కోట్లతో 36 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ప్రారంభించింది. ఇందులో ఇప్పటికే 11 చెక్‌డ్యామ్‌లు దాదాపు పూర్తయ్యాయి. మిగతావి నిర్మాణం లో ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 700 ఎకరాలకు సాగు నీరు అందుతున్నది. ఇటీవల ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 3 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ. 971.00 లక్షలు, సిర్పూర్ నియోజకవర్గంలో 4 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.1278.50 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు యాసంగి పంటలకు వరంగా మారుతున్నాయి. రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకొని వాగుల్లోని నీటిని యాసంగి పంటలకు అందిస్తున్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలతో ఇది వరకు వాగులో నీరంతా వృథాగా పోయేది. ఒక్క వానకాలం పంటే వేసేటోళ్లం. చెక్‌డ్యామ్ నిర్మించినప్పటి నుంచి యేటా రెండు పంటలు సాగు చేస్తున్నం. వాగులో మార్చి, ఏప్రిల్ నెలల వరకు కూడా నీరు ఉంటుంది.

చెక్‌డ్యామ్ నిర్మించి నీటిని పొలాలకు మళ్లించడం గొప్ప విషయం. భూగర్భ జలాలు పెరిగి బోర్లలో కూడా పుష్కలంగా నీళ్లుంటున్నయ్. ఇంత మంచి ఆలోచన చేసిన సర్కారుకు రుణపడి ఉంటాం. ఖమాన వాగులో వేసవిలో కూడా నీరు ఉంటుంది. చెక్‌డ్యామ్ నిర్మించక ముందు నీరంతా వృథాగా పోయి పెద్దవాగులో కలిసేది. చెక్‌డ్యామ్ నిర్మించినప్పటి నుంచి పంటలకు ఢోకా లేకుంటైంది. పుష్కలంగా నీరుంటుంది. మోటర్లు పెట్టుకొని యాసంగి పంటలకు వాడుకుంటున్నం. నేను ఈ సారి జొన్న పంట వేసిన. తెలంగాణ రాకముందు మా బాధలను పట్టించుకున్నోళ్లు లేరు. సీఎం కేసీఆర్ రైతులకు ఎంతో మేలు చేసే పనులు చేస్తున్నడు.



# ప్రత్యేక నిధులు.. ప్రగతికి మార్గాలు



నేరడిగొండ : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మండలంలో ప్రత్యేక అభివృద్ధి నిధులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రోడ్లు శరవేగంగా సాగుతున్నాయి. సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలు, ప్రహరీ, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు చకచకా సాగిపోతున్నాయి. దీంతో అంతర్గత రోడ్ల సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 27 గ్రామాలకు గాను రూ.1.50 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామ పంచాయతీల వారీగా రూ.10 నుంచి 20 లక్షలు వెచ్చించింది. దీంతో ఆయా గ్రామాల్లో అంతర్గత రోడ్ల సమస్యలు తీరనున్నాయి. ఇందులో బొందిడి, బోరిగాం, బుగ్గారం (బీ), చించోలి, ధన్నూర్(డీ), ఇస్పూర్, కిష్టాపూర్, కొర్టికల్(బీ), కుంటాల(బీ), లఖంపూర్, మథురతండా, నాగమల్యాల్, పట్‌పడితండా, పీచర, రాజులతండా, రేంగన్‌వాడి, శంకరాపూర్, సావర్‌గాం, సుర్దాపూర్, అద్దాల తిమ్మాపూర్, సేవాదాస్‌నగర్, నారాయణపూర్, నేరడిగొండ, యాపల్‌గూడ, తర్నం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజాప్రతినిధులతో సమావేశమై ఏఏ పనులు చేపట్టాల్లో ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. ఇందుకోసం సర్పంచ్‌ల నుంచి ఎంపీడీవోల ద్వారా ప్రతిపాదనలు తీసుకున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. రోడ్ల పనులు మండలంలో చకచకా జరుగుతున్నాయి.

# వార్డెన్ల కొరత.. విద్యార్థుల వెత



జనగామ : నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, వార్డెన్ల కొరత కారణంగా సంక్షేమ వసతిగృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖలకు చెందిన 40 వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో వందలాది మంది విద్యార్థులు ఉంటున్నారు. వీటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉండడంతో వసతిగృహాల నిర్వహణపై ప్రభావం పడుతోంది. చాలా వసతిగృహాల్లో వర్కర్లే వార్డెన్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఒక్కో వార్డెన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఎక్కడా సరిగ్గా పనిచేయని పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్ కుక్, కమాటీ, ఇతర పోస్టులను భర్తీ చేయకపోవడంతో భోజనం తయారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలువురిని నియమిస్తుండడంతో నిర్వహణ వారి చేతుల్లోకి పోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వార్డెన్లు నిర్వహించే విధులు రద్దయ్యాయి. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు నిర్వహించే విద్యార్థుల వ్యాయామం, స్టడీ అవర్స్ సకాలంలో అల్పాహారం అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. సాయంత్రం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు స్టడీ అవర్స్, హోంవర్క్, పర్యవేక్షణ, మోటివేషన్, విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ ప్రక్రియలు కొనసాగడం లేదు. జిల్లాలో ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ వసతిగృహాల్లో సుమారు 20 మంది ఇన్‌ఛార్జి వార్డెన్లు ఉన్నారు. సంక్షేమ వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్నింటిలో తాగునీరు, తదితర సదుపాయాలు కరవయ్యాయి. శిథిలావస్థకు చేరిన గదుల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. విద్యుత్తు సమస్యలు నెలకొన్నాయి. స్నానాల గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. కొన్ని వసతిగృహాల్లో విద్యుత్తు తీగలు బయటకు వేలాడుతూ యమపాశాలను తలపిస్తున్నాయి. అడిగే వారు లేక, బాగు చేయించే వారు లేక విద్యార్థులు సర్దుకుపోతున్నారు. నిత్యం ఏదో ఒక సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లోపంతో గతంలో పలు ఘటనలు జరిగాయి. అలాంటివి పునరావృతం కాకుండా ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలపై దృష్టి సారించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు. సంక్షేమ వసతిగృహాల్లో వార్డెన్ల కొరత ఉన్నప్పటికీ ఇన్‌ఛార్జులను నియమించి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని సంక్షేమశాఖల అధికారులు కొర్నేలియస్, రవీందర్ పేర్కొన్నారు. వార్డెన్ల ఖాళీల భర్తీ ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు.

# నత్తనడకన చెక్‌డ్యాంల నిర్మాణం



హుజూరాబాద్: వరదను ఒడిసిపట్టేందుకు వీలుగా నిర్మిస్తున్న చెక్‌డ్యాంల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. కొరవడిన అధికారుల పర్యవేక్షణ, గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల ఆగుతూ.. సాగుతూ.. పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లు దాటినా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇటీవల ఈఎన్‌సీ(జనరల్) మురళీధర్‌రావు చెక్‌డ్యాంల పరిస్థితిపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. మే 31 లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతోనైనా చెక్‌డ్యాంల పనులు గడువులోగా పూర్తవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని మానేరు వాగు, ఇతర వాగులపై రూ.174 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 28 చెక్‌డ్యాంల పనులు రెండేళ్లు దాటినా పూర్తి కావడం లేదు. 2020లో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి-2021లోనే పూర్తి చేయాల్సి ఉన్నా జాప్యం జరిగింది. మరోరెండుసార్లు గడువు పొడిగించినా అదే నిర్లక్ష్యం. 31.05.2022లోగా పనులు పూర్తయ్యేలా ఈఎన్‌సీ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ ఇంతవరకు కనీసం ఒక్కటి కూడా పూర్తికాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కరీంనగర్ వంతెన, చేగుర్తి, బొమ్మకల్-1, బొమ్మకల్-2లోని మానేరు వాగుపై రూ.77.24 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అయిదు చెక్‌డ్యాంలు 70 శాతానికి మించి పూర్తి కాలేదు. కేశవపట్నం, గద్దపాక, ఆర్కండ్ల వాగులపై రూ.8.70 కోట్లతో చేపడుతున్న మూడు చెక్‌డ్యాంలు 55 శాతం నుంచి 70 శాతం మధ్య పనులే పూర్తయ్యాయి. ఆర్కండ్ల చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోయింది. లింగాపూర్, వేగురుపల్లిలోని మానేరు వాగుపై రూ.39.48 కోట్లతో నిర్మించే రెండు చెక్‌డ్యాంలు 65 శాతం నుంచి 75 శాతం పూర్తయ్యాయి. ముగ్దంపుర ఇరు కుల్ల వాగుపై రూ.6.32 కోట్లు, నల్లగుంటపల్లిలోని ఇరుకుల్లవాగు, గోపాల్‌పూర్ నగునూరు వాగుపై రూ.16 కోట్లతో నిర్మిస్తున్న మూడు చెక్‌డ్యాంల పనులు ఇటీవలే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి కల్వల వాగుపై రూ.4.70 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులు రెండేళ్లు దాటినా 66 శాతమే పూర్తయ్యాయి. బ్రాహ్మణపల్లి కల్వల వాగుపై రూ.3.36 కోట్లతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం 70 శాతమే పూర్తయింది. ఇల్లందకుంట మండలం వాగొడ్డు రామన్నపల్లి, మల్యాల-1, మల్యాల-2, పాతర్లపల్లి-1, పాతర్లపల్లి-2, జమ్మికుంట మండలంలోని మడిపల్లి వాగులపై రూ.7.52 కోట్లతో ఆరు చెక్‌డ్యాంల పనులు 80 శాతానికి మించలేదు. కమలాపూర్ మండలం నేరెళ్ల, శనిగరం, గూడూరు వాగులపై రూ.12.04 కోట్లతో నిర్మించే నాలుగు చెక్‌డ్యాంలు 90 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. హుజూరాబాద్ మండలంలో నాలుగు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.4.31 కోట్లు మంజూరవగా జూపాకలో పనులు నిలిచిపోయాయి. కనుకులగిద్దలో పనులను రద్దు చేశారు. రాంపూర్‌లో కేవలం 40 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. 2020లో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల చెక్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. తిరిగి పనులు చేయాలంటే ఒప్పందంలోని నిధుల కంటే రెట్టింపు అవుతుందని, తాము నష్టపోతామంటూ గుత్తేదారులు చేతులెత్తేశారు. లస్మక్కపల్లి వాగుపై చెక్‌డ్యామ్ సీసీ, అప్రాన్ పూర్తిగా ధ్వంసమైంది. రామకృష్ణాపూర్‌లో వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ కట్ట వరదలకు తెగి ఫ్లడ్‌బ్యాంకు దెబ్బతింది. పోతిరెడ్డిపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ సీసీ వరదల వల్ల పూర్తిగా దెబ్బతింది. మర్రిపల్లిగూడెంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఫ్లడ్‌బ్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో 12 గజాల లోతుకు కోతకు గురైంది. గోపాలపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యామ్ ఫ్లడ్‌బ్యాంకు, సీసీ పూర్తి దెబ్బతింది. నేరెళ్లలో నిర్మించిన చెక్‌డ్యామ్ వరదలకు పూర్తిగా దెబ్బతింది. బాడివాల్, అప్రాన్ బీములు, అపార్ట్‌మెంట్ రింగ్స్, సీసీ కొట్టుకుపోయాయి.

# ఉన్నతీకరించినా.. అరకొర సౌకర్యాలే..!



మహబూబాబాద్, :వైద్యశాలకు వచ్చే రోగులకు అవసరమైన పరీక్షలు, శస్త్రచికిత్సలను చేసేందుకు ఉపయోగించే ఆధునిక పరికరాలను అందిస్తేనే ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన గూడూరు, గార్ల మండల కేంద్రాల్లో రూ. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)ల్లో పూర్తిస్థాయిలో అత్యవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో రోగులు అసౌకర్యాలకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా స్థాయి పెంచిన ప్రభుత్వం వైద్యశాలలకు పరికరాలు, పలు విభాగాల్లో వైద్య నిపుణులను నియమించాల్సి ఉంది. అందుబాటులో సర్కారు ఆసుపత్రి ఉన్నా.. సదుపాయాలు లేక దూరప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఏజెన్సీవాసులు పరుగెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ వైద్య పరికరాల కొరతే అసలు సమస్యగా మారింది. అలాగే వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు కూడా పూర్తి స్థాయిలో లేరు. ప్రతి రోజు వందకు పైగా రోగులు వచ్చే ఈ ఆసుపత్రిలో అంతంతే వైద్య సేవలు అందుతున్నాయి. సీహెచ్‌సీ వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు స్కానింగ్ యంత్రం లేకపోవడంతో సమీపంలో ఉన్న అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అవసరమైనప్పుడు ఆ యంత్రాన్ని తీసుకుని పరీక్షలు నిర్వహించాక మళ్లీ అక్కడకు పంపిస్తున్నారు. సాధారణ ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. వాటిలో ఉపయోగించే ఎక్స్‌రే ఫిల్మ్‌ను ప్రభుత్వం సరఫరా చేయక పోవడంతో ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల ఈ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. శస్త్ర చికిత్సలకు అవసరమైన ఆధునిక పరికరాలను సమకూర్చాలి. పది పడకలతో ఐసీయూ, 3 పడకలకు వెంటిలేటర్లు ఏర్పాటు చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు సంబంధిత వైద్య నిపుణులు జనరల్ ఫిజీషియన్, ఫల్మనాలజిస్ట్, మత్తు వైద్య నిపుణులను నియమించా లి. రేడియాలజిస్ట్‌ను కూడా డిప్యూటేషన్, ఒప్పంద పద్ధతిలో కాకుండా పూర్తి స్థాయిలో నియమించాల్సి ఉంది. ఈ ఆసుపత్రిలో ప్రభుత్వం ఎలాంటి వైద్య పరికరాలను అందించలేదు. వివిధ సంస్థలు, దాతలు అందించిన ఆక్సిజన్ ప్లాంట్, ఇతర పరికరాల ద్వారానే రోగులకు సేవలు అందుతున్నాయి. గార్లలో రూ. 5 కోట్ల వ్యయంతో 30 పడకలతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో శస్త్రచికిత్సలు చేసే పరికరాలు లేవు. రోజూ ఈ ఆసుపత్రికి సుమారు వంద నుంచి 150 మందికిపైగా రోగులు వస్తుంటారు. వైద్య పరికరాలు లేకపోవడంతో కేవలం పరీక్షలు చేయించుకునే వెళుతున్నారు. ఈ ఆసుపత్రిలో ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరంతో పాటు శస్త్రచికిత్సలు చేసేందుకు వినియోగించే పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పరికరాలను అందించేందుకు ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ రూ. 20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదు. మత్తు వైద్యనిపుణుడు, గైనకాలజిస్ట్, ఆప్తాల్మజిస్ట్, ఆర్థోపెడిక్, దంత వైద్య నిపుణుడు, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్‌ను విధులు నిర్వహించే విధంగా నియమించాల్సి ఉంది.

# ప్యాకింగ్‌కు నిబంధనలున్నాయి..



కరీంనగర్: మార్కెట్‌లో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పలు కంపెనీలు, వ్యక్తులు వివిధ రకాలు వస్తువులు, ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తుంటాయి.కొందరు ఇక్కడే మోసాలకు తెరలేపుతున్నారు. తూకం, కొలతల్లో తేడాలు, చిరునామా లేని చిరుతిండి ఆహార పధార్థాల పొట్లాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ప్యాకింగ్ ద్వారా విక్రయాలు : తినుబండారాలు, వస్తువులు ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. చాలా సంస్థలు ప్యాకెట్లపై వివరాలు ముద్రించడం లేదు. దీంతో వినియోగదారులకు ఆ వస్తువుకు సంబంధించి సమాచారం తెలియని పరిస్థితి ఉంటుంది. కిరాణ దుకాణాలు, కొన్ని సూపర్‌మార్కెట్లలో ప్యాకెట్ల రూ పంలో విక్రయించే వాటిపై తయారీదారు చిరునామా, ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండటం లేదు. పాతవాటిని తొలగించి కొత్త స్టిక్కర్లు వేస్తూ ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గడువుకు ముందే వస్తువు, తినుబండారాలు చెడిపోతే ప్యాకెట్లపై ఉన్న వివరాల ఆధారంగా (కస్టమర్ కేర్) తయారీదారుడికి ఫోన్ చేసి అడిగే అవకాశం ఉంటుంది. ఇలా ఇది వినియోగదారులకు ఎంతో ఉపయోగపడుతుంది. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకోవచ్చు. వ్యాపార సంస్థలు, కంపెనీలు తమ వస్తువులు ప్యాకింగ్ రూపంలో విక్రయించాలని అనుకుంటే తూనికలు కొలతల శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్యాకింగ్ విధానానికి సంబంధించి ప్రభుత్వం నిబంధనల్లో మార్పు చేసిం ది. ప్యాక్‌పై పూర్తి వివరాలు ముద్రించడంతో పాటు గ్రాము నుంచి కిలో వరకు ఎంత ధర పలుకుతుందో ప్యాక్‌పై వేయాలని పేర్కొంది. ఉదాహరణకు.. కిలో చక్కెర ప్యాకెట్ తీసుకుంటే గ్రాముకు ఎంత పడుతుంది, 25 కిలోల బియ్యం సంచి తీసుకుంటే కిలోకు ఎంత ధర పడుతుందో కొనుగోలుదారుడికి తెలిపేలా ముద్రించాల్సి ఉంటుంది. దీంతో వినియోగదారుడికి ఏ కంపెనీ ధర ఎంత పడుతోంది సులువుగా తెలుస్తుంది. ఈ విధానం గతేడాది నవంబర్ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశాలు వచ్చినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మార్కెట్, దుకాణాలల్లో తూకంలో మోసం, సిలిండర్‌లో పరిమాణం కన్న గ్యాస్ తక్కువగా ఉండటం, పెట్రోల్ బంక్‌లో పెట్రోలు, డీజిల్ తక్కువగా వస్తున్నట్లు అనుమానం ఉంటే ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతల శాఖ సహాయ కంట్రోలర్ విజయసారథి తెలిపారు. ఫిర్యాదులు అందితే తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. బిస్కెట్లు, బ్రెడ్, పాలు, పెరుగు, చిప్స్, మిఠాయి, చిరుధాన్యాలు, నూనె, ఇతర ఆహార పదా ర్థాలు, వస్తువులు ఇలా.. ఏదైనా ప్యాకింగ్ రూపంలో ఉంటే కంపెనీ చిరునామా, వస్తువు పేరు, పరిమాణం, అందులో ఏమేమి ఉన్నాయి, విక్రయించే ధర, పిన్‌కోడ్‌తో సహా వస్తువు తయారీ కేంద్రం చిరునామా, డిక్లరేషన్, చరవాణి నంబర్, కస్టమర్‌కేర్ వివరాలు తప్పనిసరిగా ఉండాలి. పూర్తి వివరాలను ఒకేచోట ముద్రించాలి. వేర్వేరుగా ముద్రిస్తే అందుకు గల కారణాలను ప్యాక్‌పై రాయాలి. ప్యాకింగ్‌పై ముద్రించిన వివరాలపై చెరిపివేతలు, పాతవి తొలగించి కొత్తవి వేయడం, స్టిక్కర్లు వేయడం లాంటివి చేయకూడదు.

# సంఘం అభివృద్ధికి 'సహకారం'



ములుగు:వ్యాపారపరంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తాడ్వాయి సహకార సంఘానికి ప్రభుత్వం చేయూతనందిస్తోంది. వ్యాపారానికి ఏమాత్రం అనుకూలత లేని ఈ మండలంలో పదేళ్లుగా అమ్మకాలు, కొనుగోళ్లలో సహకార సంఘం మంచి లాభాలు సాధిస్తోంది. దీనిపై దృష్టిసారించిన ప్రభుత్వం సంఘాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రూ.36 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో తాడ్వాయిలోని కార్యాలయ భవన విస్తరణ, కాటాపురంలో నూతన భవన నిర్మాణం చేపట్టారు. తాడ్వాయి మండలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనిపై దృష్టిసారించిన సహకార సంఘ పాలకవర్గం వానాకాలం, రబీ సీజన్‌లలో వరి విత్తనాలు, ఎరువుల విక్రయాలు ప్రారంభించింది. వీటితో పాటు ధాన్యం కొనుగోళ్లు పెద్ద మొత్తంలో చేపట్టడంతో లాభాలు పెరిగాయి. అమ్మకాలు, కొనుగోళ్ల కారణంగా ప్రస్తుతమున్న భవనం ఏమాత్రం సరిపోవడం లేదు. సమస్యను గుర్తించిన జిల్లా అధికారులు ప్రస్తుత భవనంపై ఒక అంతస్తు నిర్మించేందుకు రూ.8 లక్షలు మంజూరు చేశారు. సంఘానికి వచ్చే లాభం నుంచి మకొన్ని నిధులు వెచ్చించి పనులు ప్రారంభించారు. మండలంలో ఎక్కువ క్రయ విక్రయాలు కాటాపురంలో జరుగుతున్నాయి. ఈ గ్రామంలో ధాన్యం, గోనె సంచులు, ఎరువులు నిలువ చేసుకోవడం సంఘానికి ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను గుర్తించిన అధికారులు రూ. 28 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పంచాయతీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో భారీ గోదాంను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే రైతులకు, సంఘానికి ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. కాటాపురం ప్రాంత రైతులు ఎరువుల కోసం మండలకేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదు. సంఘానికి వచ్చే ఎరువుల నిల్వల్లో కొంత కాటాపురంలో దిగుమతి చేసి రైతులకు విక్రయిస్తామని పీఏసీఎస్ ఛైర్మన్ పులి సంపత్ తెలిపారు.

# మొక్కజొన్న ధర ఆశాజనకం



చేగుంట:జిల్లా వ్యాప్తంగా 3,039 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఉత్పత్తులు చేతికి వస్తుండటంతో ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.1,962గా ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో రూ.2,200 పలుకుతోంది. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. దాణా పరిశ్రమల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.2,400 వరకు ఉంది. రైతులు మొక్కజొన్న జూళ్లు తీసి, పలు చోట్ల రహదారులపై, పొలం వద్ద ఎండబెడుతున్నారు. ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని పేర్కొంటున్నారు. చేగుంట మండలం కర్నాల్‌పల్లి, బోనాల, మక్కరాజుపేట, చందాయిపేట, ఇబ్రహీంపూర్, బి.కొండాపూర్, చిన్నశివునూర్ తదితర గ్రామాల్లో మొక్కజొన్న అధికంగా సాగు చేశారు. రెండేళ్ల క్రితం వరకు యాసంగిలో తక్కువగా సాగయ్యేది. గతేడాది నుంచి మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. ఉత్పత్తులను కొనుగోలు చేసిన వ్యాపారులు ఫ్యాక్టరీలకు అమ్ముతున్నారు. గతంలో వానాకాలంలో చాలా మంది రైతులు మొక్కజొన్న సాగుచేసేవారు. ప్రస్తుతం నీటి వనరులు ఎక్కువగా ఉండటంవల్ల వరి వైపు మొగ్గుచూపడంతో వీటి కొరత ఏర్పడింది. అందువల్ల వాటి ధర పెరుగుతూ వస్తోంది. దీంతో యాసంగిలో మొగ్గు చూపారు.

# నిబంధనలు కఠినం.. అవగాహన లేకుంటే అనర్థం



లక్సెట్టిపేట: అవగాహన ఉండి గతంలో లైసెన్సు తీసుకున్న వారు మాత్రమే తిరిగి పునరుద్ధరించుకుంటున్నారు. వీరిలో బ్యాంకు రుణాలు, ఇతర అవసరాలు ఉన్న వారు ధ్రువీకరణ పత్రాలు అవసరమైనందున ట్రేడ్ లైసెన్స్ పొందుతుండగా మిగతా వారు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గతంతో పోలిస్తే ఒకే సారి పెద్ద ఎత్తున లైసెన్సు రుసుము వసూలు చేస్తున్నారన్న కారణంగా వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా ట్రేడ్ లైసెన్స్ తీసుకున్న వారి సంఖ్య పరిమితంగానే ఉంది. గతంలో తీసుకున్న వారు ఏటా పునరుద్ధరించుకుంటుండగా మిగతా వారు అవసరం అనుకుంటే తప్ప లైసెన్సులు తీసుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా చిన్న దుకాణాల యజమానులు మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుం టుండగా పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాలు, సినిమా హాళ్లు, హోటళ్లు, రైస్ మిల్లుల యజమానుల్లో చాలా వరకు లైసెన్స్ తీసుకోకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఏ పురపాలికలో కూడా ఇప్పటి వరకు కొత్తగా 25 శాతానికి మించి వ్యాపారులు కొత్తగా లైసెన్స్ తీసుకోకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. జిల్లా అదనపు పాలనాధికారి రాహుల్ ప్రోత్సాహం, మున్సిపల్ అధికారుల ప్రత్యేక చొరవ కారణంగా లక్సెట్టిపేటలో ట్రేడ్ లైసెన్స్ తీసుకున్న వ్యాపారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 638 మంది ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉందని మున్సిపల్ సిబ్బంది గుర్తించారు. గత ఏడాది మే నాటికి 11 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్స్ పొందగా ప్రస్తుతం వారి సంఖ్య 191కి చేరింది. అధికారులు, సిబ్బంది తరచూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పిస్తుండటం సత్ఫలితాలు ఇస్తోంది. ట్రేడ్ లైసెన్స్ మంజూరులో గతానికి భిన్నంగా ప్రస్తుతం పురపాలక శాఖ కొత్త చట్టం తీసుకొచ్చింది. రహదారి వెడల్పు ఆధారంగా వ్యాపార, వాణిజ్య సంస్థలకు కొలతలు నిర్వహించి మదింపు చేయాల్సి ఉంటుంది.

# వేతనాలందక వెతలు!



రాజంపేట:జిల్లాలోని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం సబ్‌డివిజన్ కేంద్రాల్లోని ల్యాబ్‌అసిస్టెంట్లుగా పనిచేస్తున్నవారికి గత ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు జీతాలు చెల్లించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా ఫలితం లేదనివారంతా వాపోతున్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కేంద్రాల్లోని నీటి పరీక్ష కేంద్రాల్లో 60 మంది పనిచేస్తున్నారు. వీరందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి నెలా తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్ష సమయంలో ఎలాంటి లోపాలున్నా అధికారులకు తెలిపి వాటికి పరిష్కారా లు తెలపడం వారి పని. ప్రతి ల్యాబ్‌లో ఆరుగురు పనిచేస్తున్నారు. వీరికి వివిధ స్థాయిలు బట్టి రూ.15 వేల నుంచి రూ.21,500 వరకు వేతనా లిస్తుండగా, గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంపై వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ రాజంపేట డీఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు చెల్లించక పోవడం వాస్తవమేనన్నారు. బడ్జెట్ లేని కారణంగా చెల్లింపులు నిలిచిపో యాయని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# వనరుల నిర్వహణతోనే.. భవిత



ఆదిలాబాద్ :నీటిని వృథా చేస్తే, నిల్వ చేసుకునే చర్యలు చేపట్టకపోతే.. భూగర్భ జలమట్టం తగ్గిపోతుంది. తాగు, సాగు నీరు లేక కరవు పరిస్థితులు ఏర్పడతాయి. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని నిల్వ చేస్తూనే.. పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. నీటి ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు ఏటా మార్చి 22న అంతర్జాతీయ నీటి దినంగా ఐరాస నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో భిన్న పరిస్థితులు ఉంటాయి. ఒకసారి అనావృష్టి అయితే మరోసారి అతివృష్టి. వర్షం నీటికి అడ్డుకట్ట వేయకపోవడం, నిల్వ చేసుకునే నిర్మాణాలు చేపట్టకపోవడంతో తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 70 శాతం వర్షాధారంగానే సాగు జరుగుతోంది. వర్షాభావంతో బావులు, చెరువులు, నదీ జలాశయాల్లో నీటి వనరుల లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఓవైపు నీటి నిల్వకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, మరోవైపు వినియోగం పెరగటంతో జిల్లావ్యాప్తంగా మిగులు జలాలు తగ్గిపోతున్నట్లు అధికారులు సర్వేలో తేలింది. రాష్ట్రం ఏర్పడ్డాక జిల్లాల వారీగా నీటి నిల్వలపై సర్వే చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కురిసే వర్షం నీటిని అధికారులు అంచనా వేశారు.. ఏడాదిలో 149 టీఎంసీల వర్షం నీరు అందుబాటులో ఉంటుండగా, నిల్వ చేసేందుకు వీలుగా ప్రాజెక్టులు, ఇతర నిర్మాణాలు చేపట్టకపోవడంతో.. ఏటా 77 టీఎంసీల జలం వృథాగా సముద్రంలో కలిసిపోతుందని తేల్చారు.. మిషన్ కాకతీయలో భాగంగా చెరువులను పునరుద్ధరించడంతో నీటి నిల్వ పెరిగింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో భూగర్భ జలాల్లో గణనీయంగా పెరుగుదల ఉంది. కుమురంభీం, మంచిర్యాల జిల్లాలో పెద్దగా మార్పులేదు. వాటర్‌షెడ్ కింద చేపట్టే నిర్మాణాలతో సత్ఫలితాలు వస్తున్నాయి. సాగు భూముల్లో వాలుగా ఉన్న ప్రాంతాలను కుంటలు, రాతి కట్టడాలు, భూమి కోతకు గురికాకుండా చిన్న నీటి కుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించారు. గుట్టల నుంచి వచ్చే నీటిని ఒడిసి పట్టి భూగర్భజలాలు పెంచేందుకు కందకాలు తవ్వించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్ కమిటీలకు నేరుగా నిధులు మంజూరు కావడం, పనుల పూర్తిలో ప్రజలు భాగస్వామ్యం వహించడం, పర్యవేక్షణతో పనులు పూర్తిసాయిలో చేయడానికి వీలు కలిగింది. ఉట్నూర్, బజార్‌హత్నూర్, ఆసిఫాబాద్, కౌటాల, నార్నూర్, గుడిహత్నూర్, కుబీర్, తానూర్ తదితర మండలాల్లోని 40 గ్రామాల్లో గతంలో పనులు చేపట్టారు.బి ఆదిలాబాద్ మండలంలోని కొత్తూర్ పంచాయతీ పరిధిలో వాటర్‌షెడ్ కింద గతంలో పనులు చేపట్టారు. వర్షం నీరు నిల్వ ఉండటంతో గ్రామంలో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో గతంలో వర్షాధార పంటలకు పరిమితమైన రైతులు నేడు రెండు, మూడు పంటలు పండిస్తున్నారు. కుమురంభీం జిల్లాలోని అడదస్నాపూర్ గ్రామంలో వాటర్‌షెడ్ కింద చెక్‌డ్యాంలు, కుంటలు తదితర వాటిని నిర్మించడంతో భూగర్భజలాలు' ఇబ్బందులు పడ్డ ప్రజలు నీటి మట్టం పెరగడంతో సమస్య దూరమైంది. గ్రామంలోని వ్యవసాయ బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరగడంతో రెండో పంట సాగు చేయడానికి వీలు కలిగింది. నీటి వనరులు తగ్గిపోకుండా, సురక్షితంగా చిరకాలం ఉండేందుకు ఆయా వనరులను మెరుగ్గా నిర్వహించేలా చేయడమే అంతర్జాతీయ నీటి దినం లక్ష్యం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1992 నుంచి ఏటా మార్చి 22న నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'మార్పును వేగవంతం చేస్తుంది.. నీరు మనందరినీ ప్రభావితం చేస్తుంది.. ప్రతి ఒక్కరు చర్య తీసుకోవాలి' అనే అంశంతో కార్యక్రమాలు చేపట్టనుంది. భూగర్భ జలాలను ఫిజోమీటర్లతో కొలుస్తారు. వీటిని ప్రతి మండలంలో ఒకటి ఏర్పాటు చేసి నెల వారీగా అధ్యయనం చేస్తున్నారు. గతంతో పోలిస్తే నీటిమట్టం పెరిగింది. అయితే జిల్లాల్లో నేలలు ఒకే మాదిరిగా ఉండకపోవడంతో మండలాల వారీగా భిన్నంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

# పల్లె ప్రకృతివనాలపై నిర్లక్ష్యం..




కౌటాల :పల్లె ప్రకృతివనాల్లో ఎక్కడ చూసినా.. వాడిన మొక్కలు, ఎండిన చెట్లే కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక, సిబ్బంది నిర్వహణ కరవై.. రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం పల్లెల్లో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఉద్యాన వనాలు అభాసుపాలవుతున్నాయి. ఆహ్లాదం మాట దేవుడెరుగు కనీసం మొక్కల సంరక్షణకు కూడా చేపట్టడం లేదు. వేసవిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి. జిల్లాలో ఇటీవల కౌటాల, తిర్యాణి, రెబ్బెన మండలాల్లో పల్లెప్రకృతి వనాలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో చెట్లు, మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. బహుళ ప్రయోజనాలను ఆశించి జిల్లావ్యాప్తంగా 1100 పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటిని పర్యవేక్షించేవారు లేక ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పలుచోట్ల పల్లె ప్రకృతి వనాలు కేవలం మొక్కల పెంపకానికే పరిమితమయ్యాయి. అన్ని గ్రామాల్లో దాదాపుగా వీటిని ఊరికి 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. దీంతో అవి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. అడపాదడపా జిల్లాస్థాయి అధికారులు తప్ప కిందిస్థాయి వారు వాటివైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని వనాల్లో ఇప్పటికే మొక్కలు ఎండిపోగా, మరికొన్ని చోట్ల గడ్డి విపరీతంగా పెరిగింది. వేసవిలో వ్యవసాయ పనులు ముగియడంతో రైతులు చేన్లలోని పత్తి కట్టెలను పోగు చేసి నిప్పంటిస్తున్నారు. ఈక్రమంలో చేన్లకు ఆనుకొని ఉన్న పల్లెప్రకృతి వనాలకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల్లో మొక్కలు పెంచి.. రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యత చూడాల్సింది. మొక్కలకు నీళ్లు పోయడానికి కూలీని ఏర్పాటు చేసి రోజువారీ డబ్బులు కూడా ఉపాధిహామీ పథకం నుంచే చెల్లించేవారు. ఈ ఏడాది మార్చితో ఆశాఖ గడువు ముగియనుంది. ఇక నుంచి ఆ బాధ్యత గ్రామ పంచాయతీలే చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగుకాల్వలు శుభ్రం తదితర పనులకు సరిపడా కార్మికులు లేక అష్టకష్టాలు పడుతున్న పాలకవర్గానికి కొత్త బాధ్యత తలకు మించిన భారంగా మారనుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే త్వరలో పల్లెప్రకృతి వనాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటుంది. పల్లెప్రకృతి వనాల పర్యవేక్షణ బాధ్యత ఇక నుంచి గ్రామ పంచాయతీలే చూసుకోవాలి. నిబంధనల ప్రకారం రెండేళ్ల పాటు వాటిని ఉపాధిహామీ పథకం నిధులతో సంరక్షించాం. ఏప్రిల్ నుంచి బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాలకు దూరంగా ఉన్న వనాలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటాం. ఇది కౌటాల మండలంలోని నాగెపల్లి పల్లెప్రకృతి వనం. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ నెల 15న ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పల్లె ప్రకృతివనంలోని చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంత జరిగినా ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూడలేదు.

# ఇంటి పన్ను.. పల్లెకు దన్ను!



ఆదిలాబాద్: పల్లెల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూలైతే పల్లె ప్రగతి సాధ్యమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధుల తోపాటు ఇంటి పన్నులు కీలకంగా మారాయి. ఉన్న వనరులను ఎలాగైనా రాబట్టుకోవాలనే ఉద్దేశంతో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 10 రోజులు మిగిలాయి. పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే జిల్లా 7వ స్థానంలో నిలిచింది. పంచాయతీలకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు, ఇతర నిర్వహణ వ్యయం భారంగా మారుతుండటంతో ఆదాయ వనరులైన పన్ను వసూళ్లపై అధికార్లు దృష్టి పెట్టారు. ఆయా మండలాల్లోని ఎంపీడీఓలు, ఎంపీఓలు శతశాతం పన్ను వసూలు చేయడానికి నిత్యం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దాదాపు అన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఉండడంతో జిల్లా, మండల స్థాయి అధికారులు వారిని పురమాయిస్తూ ఎక్కువ శాతం వసూలు చేయించేలా పర్యవేక్షిస్తున్నారు. ఆస్తి, ఆస్తి మార్పిడి తదితర పన్నుల రాబడిని వంద శాతం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. రోజు వారీగా వసూలు చేసిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో 468 పంచాయతీలుండగా.. ఇప్పటి వరకు 192లలో వందశాతం పన్ను వసూలైంది. మిగతా వాటిల్లో 90–95 శాతం పైగా వసూలు కాగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఉదయం ఏడింటికే వచ్చి పారిశుద్ధ్యం, నీటి సరఫరా చూస్తున్నారు. వీటికి తోడు పన్నులు వసూళ్ల లక్ష్యం ఉండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం ఉండట్లేదు. ప్రతి రోజు పంచాయతీ డిమాండ్‌లో 5శాతం మేర పన్నులు కచ్చితంగా వసూలు చేయాలనే ఆదేశాలు ఉండడంతో.. కార్యదర్శులు, కారోబార్లు కలిసి పన్ను వసూళ్లను వేగంగా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు, మండల, పంచాయతీ అధికారుల ప్రత్యేక చొరవ, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి వారికి ప్రజల భాగస్వామ్యం తోడవడంతో.. జిల్లా పంచాయతీల పన్ను వసూళ్ల లో రాష్ట్రంలో ప్రస్తుతం 7వ స్థానంలో నిలవడం గమనార్హం.

# సిబ్బంది లేక 'ఉపాధి'కి ఇబ్బంది



మంచిర్యాల: గ్రామంలో క్షేత్రసహాయకుడిని నియమించకపోవడంతో ఉపాధి హామీ పనులను, కూలీల స్థితిగతులను పర్యవేక్షించే బాధ్యతలను కార్యదర్శి చూస్తున్నారు. గతంలో ఉమ్మడి గఢ్‌పూర్ పంచాయతీకి ఒకే క్షేత్ర సహాయకుడు ఉండేవాడు. ప్రభుత్వం దీన్ని నాలుగు పంచాయతీలుగా విభజించడంతో ఆ గ్రామ క్షేత్రసహాయకుడు ఒత్తిడితో నాలుగు గ్రామాల్లో పనులు చేయలేక రాజీనామా చేశారు. ప్రస్తుతం నాలుగు పంచాయతీల్లోనూ క్షేత్రసహాయకులు లేకపోవడం ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రజాప్రతినిధులు, కూలీలు ఆవేదన చెందుతున్నారు. పేదలకు ఉపాధిని కల్పించాలనే ఏకైక లక్ష్యంతో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులు జిల్లాలో పలు పంచాయతీల్లో క్షేత్రసహాయకుల్లేక నత్తనడకన కొనసాగుతున్నాయి. సరైన ప్రణాళిక లేకపోవడంతో కూలీలు పనుల్లోకి రాలేకపోతున్నారు. క్షేత్రసహాయకులను కొత్తగా ఏర్పాటుచేసిన పంచాయతీల్లో నియమించలేదు. పాత పంచాయతీల్లో ఉన్నవారితో ఆయా గ్రామాల్లో పనులు చేస్తుండగా కొత్త పంచాయతీల్లో కార్యదర్శులే నెట్టుకొస్తున్నారు. జాబ్‌కార్డుల మంజూరు, ఆధార్ అనుసంధానం, మస్టర్ల నిర్వహణ, పనుల గుర్తింపు వంటి వాటిల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి పనుల కూలీల మస్టర్లు, ఫొటోలు తీయడం, హాజరు తీసుకోవడం వంటి పనులు క్షేత్రసహాయకుడు చేయాల్సి ఉండగా.. ఆ పనులు కార్యదర్శులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. గ్రామాల్లో కూలీలను పనుల్లోకి వెళ్లేలా చేయడం, మస్టర్ల కేటాయింపు, పనుల గుర్తింపు, జాబ్‌కార్డులకు అర్హులను గుర్తించడం వంటి పనులను చేయడంలో క్షేత్రసహాయకులు ఎంతో కీలకం. జిల్లాలో పనిచేస్తున్న క్షేత్రసహాయకుల్లో వివిధ కారణాలతో కొంత మందిని విధుల నుంచి తొలగించారు. ఆ ఖాళీలతోపాటు నూతన పంచాయతీల్లో క్షేత్రసహాయకుల అవసరం లేదని భావించి పనుల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం అప్పగించింది. కార్యదర్శులు గ్రామ పనులతోపాటు ఉపాధి హామీ పనుల నిర్వహణతో లక్ష్యం మేరకు కూలీలు పనుల్లోకి రావడంలేదు. పనులు సక్రమంగా చేయడం లేదు. గతంలో క్షేత్రసహాయకులను ప్రభుత్వమే తొలగించి, తర్వాత వారిని పునర్నియామకం చేసింది. నూతన పంచాయతీల్లో, ఖాళీలను భర్తీచేయాలని ఆదేశాలు వస్తేనే భర్తీచేసే అవకాశం ఉంటుంది. అంతవరకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులే ఆ పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రసహాయకుల కొరత కారణంగా ఉపాధి పనుల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు ఫిర్యాదులు అందలేదు.

# వేతనాలు రాక వెతలు



సిద్దిపేట :పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కష్టపడి పని చేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు గ్రామాల్లో పేరుకున్న చెత్తాచెదారం తొలగిస్తున్నారు. ప్రతి నెల కార్మికులకు వేతనాలు రావడంల లేదు. కుటుంబాలను పోషించుకోవడానికి అవస్థలు పడుతున్నామని గ్రామ పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 499 పంచాయతీలు ఉండగా దాదాపు 2500 మంది కార్మికులు పనులు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం ఒక్కొక్క కార్మికుడికి ప్రతి నెల రూ.8500 అందిస్తోంది. కొద్ది నెలలుగా పంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నామని అధికారులు చెబుతున్నారు.

# నిబంధనలు హాంఫట్.. అక్రమంగా లేఅవుట్..



నిర్మల్, :జిల్లాలో అక్రమ లేఅవుట్లపై కొరడా ఝులిపించిన అధికారులులపై రాజకీయ ఒత్తిళ్లు వచ్చి వారు స్తబ్ధుగా ఉండటంతో అక్రమ భూదందా మళ్లీ జోరందుకుంది. అనుమతుల్లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు చేస్తూ అందులోని ప్లాట్లను విక్రయిస్తున్నారు. అధికారుల రికార్డుల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 427 లేఅవుట్లు ఉన్నాయని గుర్తించగా.. ఇందులో అనుమతులు ఉన్నవి కేవలం ఎనిమిది మాత్రమే. నిర్మల్ జిల్లా కేంద్రం రోజురోజుకూ విస్తరిస్తోంది. పల్లె ప్రజలు పట్నం 'దారి' పట్టడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. స్థిరాస్తి వ్యాపారం దెబ్బకు జిల్లా కేంద్రంలోని శివారు పంటపొలాలన్నీ ప్లాట్లు మారాయి. అనుమతుల్లేకుండా లేఅవుట్లు చేస్తుండటంతో పురపాలక సంఘానికి రూ.లక్షల్లో ఆదాయానికి గండిపడుతోంది. వీటిపై అధికారుల చర్యల్లేకపోవడంతో ఒకదాన్ని చూసి మరొకటి.. పట్టణం చుట్టుపక్కల అడ్డగోలుగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. అనుమతుల్లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవన నిర్మాణాల అనుమతుల కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. నిర్మల్ పట్టణంలో అన్ని వసతులు అందుబాటులో ఉండటంతో చుట్టూ పల్లెవాసులు ఇక్కడికి వచ్చి స్థిరపడుతుండటంతో భూముల ధరలు రోజురోజుకూ అడ్డగోలుగా పెంచేస్తున్నారు. పట్టణంలోని సిద్ధాపూర్, ఆదర్శనగర్, సోఫినగర్, రాంనగర్, ఇంద్రానగర్, గొల్లపేట్, గాజులపేట్, విశ్వనాథ్‌పేట్, ప్రియదర్శినినగర్, పట్టణ శివారులోని శాంతినగర్, కొండాపూర్, మంజులాపూర్, వెంకటాపూర్, ఆదర్శనగర్, సిద్ధాపూర్, శ్యాంగఢ్, తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. అనుమతి కోసం పురపాలక సంఘానికి చెల్లించాల్సిన రుసుమును ఎగవేస్తున్నారు. భూమి స్వభావాన్ని మార్పిడి చేయకుండానే పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చుతున్నారు. పన్నులు చెల్లించకపోవడం ఆ స్థలాల్లో రహదారులు, మురుగుకాలువలు, విద్యుత్తు, తదితర వసతులేవీ కల్పించడం లేదు. ఈ విషయమై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూస్తూ ఉండిపోవడంతో పట్టణ శివారు అక్రమ లేఅవుట్ల దందా జోరుగా సాగుతోంది. జిల్లాలోని 92 గ్రామాల్లో అనుమతి లేకుండా స్థిరాస్తి వ్యాపారం సాగుతోందని అధికారులు తేల్చారు. మండల కేంద్రాలతోపాటు పెద్ద పంచాయతీల ప్రధాన రోడ్ల పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన వెంచర్లు చేస్తున్నారు. వాస్తవానికి లేఅవుట్ నమూనా, నాలా, ఈసీ, భూమిపై వివాద నిరభ్యంతర పత్రాలు సంబంధిత పంచాయతీకి అందించి ఆమోదం పొందాలి. లేఅవుట్లలో నిబంధనల మేరకు పార్కు, సామాజిక స్థలాలు, నిర్ణీత వెడల్పులో రహదారులు ఉండాలి. 'రియల్' వ్యాపారులు అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని నిబంధనలకు పాటించకుండానే వ్యవసాయ భూములకు రెవెన్యూ శాఖ ద్వారా నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్ (నాలా) అనుమతి లేకుండా ఇంటి స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారు. సహజమైన ఒర్రెలు, కాలువలను పూడ్చేసి ప్లాట్లు చేస్తున్నారు.

# సహకార సంఘాలు.. వ్యాపార వృద్ధి మార్గాలు



కరీంనగర్:ఉమ్మడి జిల్లా పరిధిలో 128 సహకార సంఘాల్లో రైతులకు సేవలు అందించడంతో పాటు మరింత ఆదాయాన్ని సమకూర్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కామన్ సర్వీసు కేంద్రాలను ఏర్పాటు చేసుకునే అవకాశం లభించింది. దీంతో రాష్ట్రంలో విజయ సంస్థకు సంబంధించి నూనెలు, బియ్యం, గోధుమ పిండి వంటి ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో అన్ని సహకార సంఘాలు, ధాన్యం కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల అమ్మకాలు, రైస్‌మిల్లుల నిర్వహణ, సూపర్‌మార్కెట్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు వంటివి ఏర్పాటు చేసి ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఉన్నారు. ఇవేకాకుండా సుమారు 36కు పైగా సహకార సంఘాల పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నారు. వీటిని పెట్రోలియం సంస్థల ఔట్‌లెట్లుగా మార్చాలని కేంద్రాన్ని కోరుతున్నారు. ప్రతీ సంఘ పరిధిలో ఒక కామన్ సర్వీసు సెంటర్లు ఉండేలా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని 128 సహకార సంఘాలను కంప్యూటీకరణ జరిగింది. ప్రత్యేక సిబ్బంది కూడా ఉన్నారు. ఈక్రమంలోనే కామన్ సర్వీసు సెంటర్లు ఏర్పాటు సులభతరం కానుంది. కంప్యూటర్, ప్రింటర్, బయోమెట్రిక్ పరికరం, ఇంటర్‌నెట్ కనెక్షన్ వంటివి అవసరం. ఇవన్నీ ఆయా సహకార సంఘాలకు ఉన్నాయి. ఈ కేంద్రం ఏర్పాటు, నిర్వహణ తీరు వంటి అంశాలపై ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రతినిధి శ్రీధర్ ఇటీవల జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో వివరించారు. ఆధార్ సవరణలు, బీమా డబ్బుల చెల్లింపులు, రైల్వే, విమాన టిక్కెట్ల బుకింగ్‌లు, ప్రధానమంత్రి కిసాన్ యోజన రిజిస్ట్రేషన్, పాన్‌కార్డుకు దరఖాస్తు చేయడం, తపాలా సేవలు వినియోగించుకోవడం, అయూష్మాన్‌భవ నమోదు, దాదాపు 300 సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. దీని నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒకరికి ఉపాధి లభిస్తోంది. వీటితో పాటు ఆయిల్‌సీడ్ కార్పొరేషన్ ద్వారా వంటనూనెతో పాటు 66 రకాల బ్రాండ్ల అమ్మకాలకు కూడా ఆ సంస్థ అవకాశం లభిస్తోంది. సహకార సంఘాల పరిధిలో రైతులకు రుణాలివ్వడం, వసూలు చేయడం ద్వారా వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. ధాన్యం కొనుగోలు, ఎరువులు విత్తనాల విక్రయాలు కూడా కొనసాగుతున్నాయి. ఛైర్మన్ల జీతభత్యాలు, సంఘాల కార్యనిర్వహణాధికారులు, ఇతర సిబ్బంది జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని చోట్ల అదనపు సిబ్బంది కూడా పని చేస్తున్నారు. దీంతో సంఘాల ఆదాయ వనరులు పెంచుకునేలా కార్యచరణ చేపడుతున్నారు.

# లక్ష్యం చేరని వ్యవసాయ మార్కెట్ల ఆదాయం!



జమ్మికుంట: తగ్గిన పంట దిగుబడి, ధరల ప్రభావం వ్యవసాయ మార్కెట్లపై పడింది. మార్కెటింగ్ శాఖ గతేడాది వరంగల్ రీజినల్ పరిధిలోని 19 జిల్లాల్లో 106 వ్యవసాయ మార్కెట్లలో నిర్ణీత ఆదాయ లక్ష్యాన్ని నిర్ణయించగా 80 శాతం ఆదాయమే లభించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్లలో రూ.431.68 కోట్లు ఆదాయం సాధించేందుకు నిర్ణయించిన లక్ష్యంలో తాజాగా రూ.346.15 కోట్లు (80శాతం) సాధించింది. రీజినల్ పరిధిలోని నాలుగు జిల్లాల మార్కెట్లు మాత్రం నిర్ణయించిన ఆదాయ లక్ష్యాన్ని అధిగమించటం విశేషం. గతేడాది నిర్ణయించిన మార్కెట్ల నిర్ణీత ఆదాయ లక్ష్యాన్ని 11 మాసాల్లోనే యాదాద్రి జిల్లా అధిగమించి రూ.25.95 కోట్ల ఆదాయంతో (137 శాతం) రీజినల్ పరిధిలో ప్రథమ స్థానాన్ని సాధించింది.

సిరిసిల్ల జిల్లాలోని మార్కెట్ల ద్వారా 8.98 కోట్ల ఆదాయం (109 శాతం), నల్గొండలోని మార్కెట్ల ద్వారా రూ.70.43 కోట్ల ఆదాయం (105శాతం), కరీంనగర్‌లోని ఏడు మార్కెట్ల ద్వారా రూ.22.92 కోట్ల (102 శాతం) ఆదాయం లభించగా మిగితా 15 జిల్లాలు వెనుకంజలో నిలిచాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, సిరిసిల్లలోని మార్కెట్లు నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించటం విశేషం.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**